గణేష్ ఉత్సవాల బందోబస్తు ఓ అనుభవం




PCW
తెలుగు దినపత్రిక
PCW News Broadcasting PVT Ltd

శ్రీ వేద పాఠశాలలో గురుపూజోత్సవం




Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 02 సంచిక - 251 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- ఆదివారం 07 సెప్టెంబర్ 2025

# బై.. బై.. గణేషా

## గంగమ్మ ఒడికి ఖైరతాబాద్ మహా గణపతి..





**బాహుబలి క్రేన్ పాయింట్ 4 దగ్గర బడా గణపతి నిమజ్జనం**

ఖైరతాబాద్ మహా గణనాథుడి నిమజ్జన మహోత్సవం ఘనంగా ముగిసింది. తొమ్మిది రోజులుగా విశేష పూజలందుకున్న బడా గణేషునికి జయ జయధ్వానాలతో ఘనంగా వీడ్కోలు పలికారు భక్తజనులు.

# ట్రంప్‌కు మోడీ మరో షాక్?

**- ఐక్యరాజ్యసమితి సమావేశాలకు దూరం**



**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 6 (పిసిడబ్ల్యూ న్యూస్):** అమెరికా అధిక టారిఫ్‌ల వేళ భారత్ తాజాగా కీలక నిర్ణయం తీసుకుంది. ఈ నెలాఖరులో అమెరికాలో జరగనున్న ఐక్యరాజ్యసమితి 80వ జనరల్ అసెంబ్లీ సమావేశాలకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ హాజరు కావాల్సి ఉన్న విషయం తెలిసిందే. అయితే, ఈ సమావేశాలకు మోదీ హాజరు కావడం లేదని తెలిసింది. ఆయనకు బదులు విదేశాంగ శాఖ మంత్రి ఎస్.జైశంకర్ ఈ సమావేశాల్లో ప్రసంగించనున్నట్లు తాజా సమాచారం. సెప్టెంబర్ 9వ తేదీ నుంచి ఐక్యరాజ్యసమితి 80వ జనరల్ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభంకానున్నాయి. హై లెవల్ డిబేట్ మాత్రం సెప్టెంబర్ 23 నుంచి 29 వరకు జరగనున్నది. చర్చలో పాల్గొనే వక్తల జాబితాను తాజాగా మిగతా2లో...

### ఆపరేషన్ సిందూర్ మూడ్రోజుల్లో

# ముగియలేదు

**• ఆర్మీ చీఫ్ ఉపేంద్ర ద్వివేది ఆసక్తికర వ్యాఖ్యలు**



**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 6 (పిసిడబ్ల్యూ న్యూస్):** జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టడం, ముగించడంపై ఆర్మీ చీఫ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ ఆపరేషన్ అందరూ అనుకున్నట్లు- మూడు రోజుల్లోనే ముగిసిపోలేదని, చాలా రోజులు కొనసాగిందని ఆర్మీ చీఫ్ ఉపేంద్ర ద్వివేది పేర్కొన్నారు. దిల్లీలో 'ఆపరేషన్ సిందూర్: ది అన్‌టోల్డ్ స్టోరీ ఆఫ్ ఇండియాస్ డీప్ స్ట్రైక్స్ ఇన్‌సైడ్ పాకిస్థాన్' అనే పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ద్వివేది మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. 'పాకిస్థాన్‌తో మే 10న యుద్ధం ముగిసిందని మీరు అనుకుంటున్నారు. కానీ కాదు. అనేక నిర్ణయాలు తీసుకోవాల్సి ఉండటంతో.. అది చాలా రోజులు కొనసాగింది. ఆ విషయాలన్నీ ఇక్కడ మిగతా2లో...



# కమిషన్లు రావనే పేదలకు ఇళ్లు కట్టలేదు

**కాళేశ్వరంతో కమిషన్లు లాగారు**

**రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా చేసారు**

**మంత్రి పొంగులేటి ఘాటు విమర్శలు**


2లో

### రాష్ట్రాల ఆర్థిక మంత్రులతో

# చర్చించాకే శ్లాబులు

**జీఎస్టీ శ్లాబులపై నిర్మలా సీతారామన్ వివరణ**

**ధరలు దిగివచ్చి..సామాన్యులకు మేలుచేస్తుందని వెల్లడి**






# ఫామ్‌హౌజ్‌లో కెసిఆర్ సుదీర్ఘ చర్చలు

**కెటిఆర్, హరీష్ రావులతో మంతనాలు**

**గజ్వేల్,సెప్టెంబర్ 6 (పిసిడబ్ల్యూ న్యూస్):** భారత రాష్ట్ర సమితి అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్‌తో మాజీ మంత్రి హరీశ్‌రావు సమావేశమయ్యారు. ఎర్రవల్లిలోని ఫామ్‌హౌస్‌కు వెళ్లి ఆయనతో ప్రత్యేకంగా భేటీ- అయ్యారు. ఇప్పటికే కేటీఆర్ సహా పలువురు పార్టీ ప్రముఖులు అక్కడ ఉన్నారు. ఇటీవల అసెంబ్లీలో చోటు-చేసుకున్న పరిణామాలు, కాళేశ్వరంపై దర్యాప్తును సీబీఐకి అప్పగించడం, ఎమ్మెల్సీ పదవికి, భారత రాష్ట్ర సమితి పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి కవిత రాజీనామా చేయడం తదితర అంశాలపై వీరు చర్చించినట్లు- తెలుస్తోంది. ఎర్రవల్లిలోని మాజీ సీఎం కేసీఆర్ ఫామ్‌హౌస్‌లో సుదీర్ఘంగా చర్చలు కొనసాగాయి. మాజీ మంత్రులు కేటీ-ఆర్, హరీష్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కేసీఆర్ భేటీ- అయిన విషయం తెలిసిందే. మిగతా2లో...

### ఢిల్లీలోని ఎర్రకోటలో

# దొంగలు

**- కోటి రూపాయల కలశం తస్కరణ**



**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 6 (పిసిడబ్ల్యూ న్యూస్):** దేశ రాజధాని ఢిల్లీలోని ఎర్రకోటలో దొంగలు పడ్డారు... ఏకంగా కోటి రూపాయలు విలువ చేసే కలశాన్ని ఎత్తుకుపోయారు..! ఈ ఘటన ఈ నెల 2వ తేదీన జరిగిందని పోలీసులు తెలిపారు. ఎర్రకోట పార్కులో నిర్వహించిన జైన మతపరమైన ఆచారం నుండి ఒక అమూల్యమైన కలశం మాయమైంది. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా కూడా ఈ మత ఆచారానికి వచ్చిన సమయంలో ఈ విషయం వెలుగుచూసింది. ఆయనను స్వాగతిస్తున్న సమయంలో ... కలశం కనబడలేదు. వ్యాపారవేత్త సుధీర్ జైన్ ప్రతిరోజూ పూజ కోసం ఆ కలశాన్ని తీసుకువచ్చే వారని పోలీసులు తెలిపారు. ఢిల్లీ పోలీసుల కథనం మేరకు ... కలశాన్ని దొంగిలించిన నిందితుడి కదలికలు సీసీటీ-వీ ఫుటేజీలో రికార్డయ్యాయి. పోలీసులు నిందితుడిని కూడా గుర్తించారు. త్వరలోనే అరెస్టు చేసి సొత్తు స్వాధీనం చేసుకుంటామని తెలిపారు. ఎర్రకోట సముదాయంలోని జైన సమాజం ఆధ్వర్యంలో కలశ పూజ ఆచారం ఆగస్టు 15 నుండి 9 వరకు కొనసాగుతుంది. ఇదే అదునుగా మిగతా2లో...

### మాతృభాషతో చదువు, ఉద్యోగాల

# అనుసంధానం

**అప్పడే ఇంగ్లీష్ వ్యామోహం తగ్గతుంది**

**తూమాటి దోణప్ప వర్ధంతి కార్యక్రమంలో వెంకయ్య**



**విజయవాడ,సెప్టెంబర్ 6 (పిసిడబ్ల్యూ న్యూస్):** చదువు, ఉద్యోగాలను మాతృభాషతో అనుసంధానం చేసే దిశగా ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు ముందుకు కదలాలని, అప్పుడే ఇంగ్లీషుపై వ్యామోహం పోతుందని పూర్వ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు మిగతా2లో...

### 35లక్షలకు బాలాపూర్

# గణేశ్ లడ్డూ



**ఏళకలుగా లడ్డూ కోసం యత్నిస్తున్న దశరథ గౌడ్**

**హైదరాబాద్, 6(పిసిడబ్ల్యూ న్యూస్):**తెలుగు రాష్ట్రాల్లో ఎంతో ప్రతిష్ఠాత్మకమైన బాలాపూర్ లడ్డూ వేలం పాట ఘనంగా సాగింది. ఈ సారి లడ్డూ వేలంలో భారీ ధర పలికింది. మిగతా2లో...

# బై.. బై.. గణేషా



**హైదరాబాద్,సెప్టెంబర్ 6 (పిసిడబ్ల్యూ న్యూస్):** హైదరాబాద్ నగరంలో గణేష్ శోభాయాత్ర అంగరంగ వైభవంగా సాగుతోంది. దారులన్నీ గణపయ్య విగ్రహాలతో హుస్సేన్ సాగర్ వైపు పయనమయ్యాయి. గణపయ్య భక్తులు ఆటపాటలతో శోభాయాత్రాలో పాల్గొంటున్నారు. గణేష్ నిమజ్జనం వేళ నగరమంతా సందడి వాతావరణం నెలకొంది. నగరంలో అత్యంత విశిష్టత కలిగిన ఖైరతాబాద్ మహా గణపతి శోభాయాత్ర ఈ ఉదయం ప్రారంభమైన విషయం తెలిసిందే. వేలాది మంది భక్తులు శోభాయాత్రలో పాల్గొనగా బడా గణేషుడు హుస్సేన్ సాగర్ కు తరలివెళ్లాడు.గణేష్ శోభా యాత్ర కన్నుల పండుగగా జరిగింది. భగభగ మండుతున్న భానుడి ని కూడా లెక్కచేయకుండా బడా గణేష్ శోభాయాత్రలో భక్తులు పాల్గొన్నారు. భక్తుల కోలాహలం మధ్య గణనాథుడు ఎన్టీఆర్ మార్గంలోని క్రేన్ నంబర్ 4 వద్దకు చేరుకున్నారు. అన్ వెల్డింగ్ పనుల అనంతరం ఖైరతాబాద్ మహా గణపతి గంగమ్మ ఒడికి చేరుకున్నాడు. బై బై గణేషా అంటూ భక్తులు వీడ్కోలు పలికారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు, అధికారులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు.

# ట్రంప్‌కు మోడీ మరో షాక్?

(మొదటి పేజీ తరువాయి)

యూఎన్ గత నెల రిలీజ్ చేసిన విషయం తెలిసిందే. తొలుత బ్రెజిల్ చర్చను ప్రారంభిస్తుంది. ఆ తర్వాత అమెరికా మాట్లాడుతుంది. సెప్టెంబర్ 23వ తేదీన యూఎన్జీఏ పోడియం నుంచి డోనాల్డ్ ట్రంప్ ప్రపంచ నేతలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. సెప్టెంబర్ 26వ తేదీన ప్రధాని మోదీ ప్రసంగం ఉంటు-ందని ఆ జాబితాలో ఉంది. అదే రోజున ఇజ్రాయిల్, చైనా, పాకిస్థాన్, బంగ్లాదేశ్ నేతలు కూడా ప్రసంగిస్తారు. ఈ సమావేశాలకు ప్రధాని యూఎస్ వెళ్తారని అంతా భావించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ భేటీ అయ్యే అవకాశం ఉన్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఇరుదేశాల మధ్య నెలకొన్న వాణిజ్య సమస్యల పరిష్కారానికి ట్రంప్-మోదీ భేటీ అయ్యే అవకాశం ఉన్నట్లు పేర్కొన్నాయి. అయితే, అనూహ్యంగా ఈ సమావేశాలకు మోదీ దూరంగా ఉన్నట్లు- తెలిసింది. దీనిపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

# ఆపరేషన్ సిందూర్ మూడ్రోజుల్లో ముగియలేదు

(మొదటి పేజీ తరువాయి)

వెల్లడించలేను' అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాక్ మద్దతు ఉన్న ఉగ్రవాదులు ఇంకా ఉన్నారని, సరిహద్దు వెంబడి వారి చొరబాటు- ప్రయత్నాలు కొనసాగుతున్నాయని తెలిపారు. భారత్ చేపట్టిన ఆపరేషన్‌లో ఎంత మంది ఉగ్రవాదులు హతమయ్యారో అందరికీ తెలుసన్నారు. ఆపరేషన్ సమయంలో సాయుధ దళాల సహకారాన్ని ఆయన ప్రశంసించారు. ఇటీవల కేంద్రం తీసుకొచ్చిన జీఎస్టీ సంస్కరణలను ద్వివేది స్వాగతించారు. డ్రోన్‌లపై జీఎస్టీని 18 శాతం నుంచి 5 శాతానికి తగ్గించడం హర్షణీయమన్నారు. భారత్ 'ఆపరేషన్ సిందూర్'తో పాక్, పీవోకేలోని ఉగ్ర శిబిరాలే లక్ష్యంగా మెరుపుదాడులు చేసింది. అత్యంత కచ్చితత్వంతో కీలక ఉగ్ర స్థావరాలను ధ్వంసం చేసింది. దీంతో ఇరుదేశాల మధ్య కొన్ని రోజులపాటు- భీకర ఘర్షణ వాతావరణం నెలకొన్న సంగతి తెలిసిందే. అనంతరం పాక్ అభ్యర్థన మేరకు భారత్ కాల్పుల విరమణకు అంగీకరించింది. ఈ క్రమంలో ద్వివేది చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

# ఢిల్లీలోని ఎర్రకోటలో దొంగలు

(మొదటి పేజీ తరువాయి)

భావించిన దొంగలు కోట్ల రూపాయల విలువైన కలశాన్ని దొంగిలించారు. ఇందుకు సంబంధించి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. నిందితులను పట్టుకోవడానికి ప్రత్యేక బృందాలతో ప్రయత్నాలు ప్రారంభించారు. దొంగిలించిన కలశం చాలా విలువై నదని, దాని విలువ దాదాపు కోటి రూపాయలు ఉంటుందని పోలీసులు చెబుతున్నారు. మొత్తం కలశం బంగారం, వజ్రాలతో పొదిగి ఉందని, ఇది 760 గ్రాముల బంగారంతో తయారు చేసిందని చెబుతున్నారు. కలశంపై 150 గ్రాముల వజ్రాలు, మాణిక్యాలు, పచ్చలు పొదిగి ఉన్నాయని సమాచారం. ఇంత విలువైన కలశం దొంగతనం కలకలం సృష్టించింది. దీనికి ముందు కూడా ఎర్రకోట వద్ద భద్రతా లోపం బయట పడింది. ఆగస్టు 2న, ఎర్రకోట భద్రత కోసం మోహరించిన పోలీసులు బాంబును గుర్తించలేకపోయినప్పుడు ఒక కేసు వెలుగులోకి వచ్చింది. ఢిల్లీ పోలీసుల కథనం ప్రకారం ... ఆగస్టు 2న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల రిహార్సల్‌లో భాగంగా మాక్ డ్రిల్ కోసం స్పెషల్ సెల్ బృందం సాధారణ దుస్తుల్లో వచ్చింది. వారు తమతో పాటు- నకిలీ బాంబును తీసుకుని ఎర్రకోటలోకి ప్రవేశించారు. కానీ ఎర్రకోట భద్రత కోసం మోహరించిన పోలీసులు ఆ బాంబును గుర్తించలేకపోయారు. అప్పుడు నిర్లక్ష్యం కారణంగా పోలీసులను కూడా సస్పెండ్ చేశారు. ఇప్పుడు దొంగతనం సంఘటన వెలుగులోకి వచ్చింది.

## ఫామ్‌హౌజ్‌లో కెసిఆర్ సుదీర్ఘ చర్చలు

(మొదటి పేజీ తరువాయి)

ఈ సమావేశంలో తాజా రాజకీయ పరిస్థితులపై చర్చిస్తున్నట్లు- తెలుస్తోంది. హరీష్ రావుపై మాజీ ఎమ్మెల్సీ కవిత చేసిన ఆరోపణలపై ఆసక్తికర చర్చ జరుగుతున్నట్లు- సమాచారం. కాళేశ్వరం ప్రాజెక్టును సీబీఐకి ప్రభుత్వం అప్పగించిన విషయంపై ఆదివారం కూడా సమావేశాలు కొనసాగే అవకాశం ఉంది. కొద్దిసేపటి క్రితమే.. ఫామ్ హౌస్ నుంచి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వెళ్లినట్లు- సమాచారం. అయితే.. ఫామ్ హౌస్‌లోనే హరీష్ రావు, కేటీఆర్ ఉండనున్నట్లు- తెలుస్తోంది. ఈ మేరకు రేపటి సమావే శాల తరువాత మీడియా సమావేశం లేదా ప్రకటన విడుదల చేసే అవకాశం ఉంది. అయితే మాజీ ఎమ్మెల్సీ కవిత చేసిన ఆరోపణలపై తాజాగా మాజీ మంత్రి హరీష్ రావు స్పందించిన విషయం తెలిసిందే. తన రాజకీయ జీవితం తెరిచిన పుస్తకమని తెలిపారు. రాష్ట్ర సాధనలో తన నిబద్ధత అందరికీ తెలుసునని చెప్పుకొచ్చారు. ప్రజల ఆకాంక్షల మేరకే పనిచేయాల్సిన బాధ్యత తనపై ఉందని నొక్కిచెప్పారు. తెలంగాణ అభివృద్ధిలో ఓ కార్యకర్తలాగా తాను పాతికేళ్లు పనిచేశానని వ్యాఖ్యానించారు. తనపై, పార్టీపై కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. తనపై చేసిన ఆరోపణలను వారి విజ్ఞతకే వదిలేస్తున్నానని పేర్కొన్నారు. తనపై దిగజారుడు రాజకీయాలు మంచిది కాదని హరీష్‌రావు హితవు పలికారు. ఈ నేపథ్యంలో ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో నిర్వహిస్తున్న సమావేశం ప్రాధాన్యత సంతరిం చుకుంది. అయితే సమావేశాల అనంతరం బీఆర్ఎస్ ఎలాంటి ప్రకటన చేస్తోంది అనే దానిపై సర్వాత్ర ఉత్కంఠ నెలకొంది.

## సీబీఐ డైరెక్టర్ ప్రవీణ్ సూద్‌కు అస్వస్థత

**- అపోలోకు తరలించి చికిత్స**

**హైదరాబాద్,సెప్టెంబర్ 6 (పిసిడబ్ల్యూ న్యూస్):** సీబీఐ డైరెక్టర్ ప్రవీణ్ సూద్ అస్వస్థతకు గురయ్యారు. దీంతో, ఆయనను జూబ్లీహిల్స్ అపోలో ఆసుప్రతికి తరలించారు. ప్రస్తుతం చికిత్స అందిస్తున్నారు. ఆరోగ్యం నిలకడగా ఉన్నట్టు- వైద్యులు వెల్లడించారు. శ్రీశైలం దర్శనం కోసం వెళ్లిన ఆయన శనివారం ఉదయం హైదరాబాద్‌కు తిరిగి వస్తుండగా అస్వస్థతకు గురయ్యారు. వెంటనే అప్రమత్తమైన సిబ్బంది.. ఆయన్ను జూబ్లీహిల్స్‌లోని అపోలో ఆసుపత్రికి తరలించారు. విషయం తెలిసిన పోలీసు ఉన్నతాధికారులంతా ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. వైద్య సిబ్బందితో మాట్లాడి ఆరోగ్య వివరాలు తెలుసుకున్నా రు.శుక్రవారం నగరానికి చేరుకున్న ఆయన హైదరాబాద్ జోన్ సీబీఐ కార్యాలయంలో ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు.

# రాష్ట్రాల ఆర్థిక మంత్రులతో చర్చించాకే శ్లాబులు

**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 6 (పిసిడబ్ల్యూ న్యూస్):** జీఎస్‌టి శ్లాబులు 5, 12,18, 28 శాతంగా ఉండేవి. అయితే ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నట్టుగా ఈ శ్లాబుల విధానం బిజెపి నిర్ణయం కాదని, రాష్ట్ర ఆర్థిక మంత్రుల సాధికార కమిటీ- తీసుకున్నదని శనివారం కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. నాలుగు శ్లాబుల విధానంపై ప్రతిపక్ష పార్టీలు దేశాన్ని తప్పుదోవ పట్టిస్తున్నాయని ఆమె శనివారం అన్నారు. నాలుగు శ్లాబుల విధానం కాస్తా.. తాజాగా జరిగిన జిఎస్‌టి కౌన్సిల్ సమావేశంలో 5, 18 శాతం శ్లాబులకి తగ్గిస్తూ.. గతంలో ఉన్న 12, 28 శాతం శ్లాబులను తొలగిస్తూ ఈ కౌన్సిల్ నిర్ణయం తీసుకుంది. ఈ శ్లాబులు సెప్టెంబర్ 22 నుంచి అమల్లోకి రానుంది. తాజాగా ఈ విషయంపై నిర్మలా సీతారామన్ పిటిఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. 'సామాన్యులపై దృష్టిసారించి సంస్కరణలు చేపట్టాము. సామాన్యుడు వినియోగించే వస్తువులపై విధించే పన్నుపై సమీక్షించాము. ఈ సంస్కరణల వల్ల రేట్లు- బాగా తగ్గనున్నాయి' అని ఆమె అన్నారు. ఇకపోతే జీఎస్టీ లో సంస్కరణలకు మద్దతు తెలిపినందుకు అన్ని రాష్ట్రాలకు ధన్యవాదాలు తెలుపుతున్నట్లు నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి అన్ని రాష్ట్రాల ఆర్థిక మంత్రులకు లేఖ రాసినట్లు- చెప్పారు. పన్ను రేట్లను సవరించాలనే దానిపై రాష్ట్రాలు అభిప్రాయాలు చెప్పినప్పటికీ.. అవన్నీ సామాన్యుడికి ప్రయోజనం కలిగించేవేనని అన్నారు. జీఎస్టీ కౌన్సిల్‌లో తీసుకున్న నిర్ణయాలు దేశ ప్రజలకు ఎంతో దోహదపడతాయన్నారు. జీఎస్టీ రేట్లలో మార్పునకు మద్దతు తెలియ జేసినందుకు ప్రతి ఆర్థిక మంత్రికి ధన్యవాదాలు తెలియజేశా. ఎన్ని తీవ్రమైన చర్చలు, వాదనలైనా చేయవచ్చు. చివరకు జీఎస్టీ కౌన్సిల్ నిర్ణయాలతో దేశ ప్రజలకు ఉపశమనం కలిగింది. ఇందుకు కృతజ్ఞతలు తెలియజేస్తూ లేఖ రాశానని నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. సామాన్యులకు ప్రయోజనం చేకూర్చే సవరణలే ఉన్నాయని, వీటికి వ్యతిరేకంగా మాట్లాడే అవకాశమే లేదన్నారు. దేశ ప్రయోజనాల కోసం అందరూ ఒక్కతాటిపైకి రావడం సంతోషకర విషయమన్నారు.రేట్ల తగ్గింపుపై రాష్ట్రాలు ఎప్పుడూ అనుకూలంగానే ఉంటాయని, అయితే, వారి ఆందోళనంతా రాబడిలో కోతపైనే ఉంటుందని నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. తాజా తగ్గింపుతో రాష్ట్రాలకే కాకుండా కేంద్రం కూడా ఆదాయం కోల్పోతుందన్న విషయం వారికి చెప్పాను. రేట్లు- తగ్గితే ప్రజలు కొనుగోలు చేస్తారు. తద్వారా కోల్పోయిన ఆదాయాన్ని ప్రభుత్వాలు భర్తీ చేసుకోవచ్చు.ఏకాభిప్రాయం కుదిరిందని కేంద్ర మంత్రి వివరించారు. ఇదిలాఉంటే, ఇటీవల తీసుకున్న జీఎస్‌టీ- కొత్త రేట్లు- సెప్టెంబర్ 22 నుంచి అమల్లోకి రానున్న విషయం తెలిసిందే.

# మాతృభాషతోచదువు, ఉద్యోగాల అనుసంధానం

(మొదటి పేజీ తరువాయి)

అన్నారు. తద్వారా మన మాతృభాషను పరిరక్షించుకుని, ముందుతరాలకు సగర్వంగా అందించడం సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు. ఆచార్య తూమాటి దొణప్ప 30వ వర్ధంతి సందర్భంగా విజయవాడలోని పీబీ సిద్ధార్థ కళాశాల ఆడిటోరియంలో 'విశిష్ట తెలుగు దిగ్దర్శనం' పుస్తకాన్ని వెంకయ్య నాయుడు ఆవిష్కరించారు. పుస్తక రూపకర్తలైన చెన్నపురి తెలుగు అకాడమీ సభ్యులు తూమాటి సంజీవరావు, తిరునగరి భాస్కర్‌తో పాటు- పుస్తకంలోని వ్యాసాలు అందించిన రచయితలకు అభినందనలు తెలిపారు. మన జీవన విధానంలో మాతృభాష ఆయువుపట్టు- అని.. తెలుగు సంప్రదా యాలను పునరుజ్జీవం చేయాలని పిలుపునిచ్చారు. జానపద సాహిత్యం మొదలుకుని, తెలుగు భాష, సాహిత్యం, సంస్కృతి తదితర విభాగాల్లో ఆచార్య దొణప్ప చేసిన కృషి మహోన్నతమైందని... సాహితీ సవ్యసాచిగా, సాహితీ కృషీవలుడిగా పేరు పొందారన్నారు. తెలుగు విశ్వవిద్యాలయం తొలి ఉపకులపతిగా దొణప్పని నియమించిన సందర్భంలో తాను అప్పటి సీఎం ఎన్టీఆర్‌ను ఓ మంచి నిర్ణయం తీసుకున్నారని అభినందించానని వెంకయ్యనాయుడు గుర్తు చేసుకున్నారు. ఎంతో మంది మహనీయుల కృషి ఫలితంగా... కేంద్ర ప్రభుత్వం తెలుగుకు ప్రాచీన హోదా ఇచ్చినా, తెలుగు వెలుగులు భావితరాలకు అందకపోవడం విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాచీన తెలుగు హోదా ఫలాలు భవిష్యత్ తరాలకు అందేందుకు తెలుగు వారంతా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# గణేష్ ఉత్సవాల బందోబస్తు ఓ అనుభవం

**● ఏ పండగ అయినా తొక్కిసలాట రాకుండా చూస్తాం ● ట్రైనీ ఐపిఎస్ అధికారులతో కమిషనర్ సివి ఆనంద్**



**హైదరాబాద్,సెప్టెంబర్ 6 (పిసిడబ్ల్యూ న్యూస్):** గణేష్ ఉత్సవాల బందోబస్తు నిర్వహించడం 13వ సారి అని, హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా నాలుగో సారి అని సివి ఆనంద్ తెలిపారు. శనివారం నేషనల్ పోలీస్ అకాడమీ నుండి 170 మంది ట్రైనీ ఐపిఎస్ అధికారులతో కమిషనర్ సివి ఆనంద్‌తో ముఖాముఖిగా మాట్లాడారు. సివి ఆనంద్ హైదరాబాద్ నగరంలో 10 సంవత్సరాలుగా విధులు నిర్వహించిన తన అనుభవాన్ని పంచుకున్నారు. హైదరాబాద్ దేశంలోనే అత్యంత సున్నితమైన, విస్తారమైన నగరాల్లో ఒకటని, ఇక్కడ అన్ని వర్గాల ప్రజలు నివసిస్తున్నారని, అందుకే పండుగల నిర్వహణ చాలా ముఖ్యమని వివరించారు. గణేష్ ఉత్సవాలకు పోలీసులు బందోబస్తు ఎలా నిర్వహిస్తారో వివరిస్తూ, ఈ ఏడాది నిమజ్జనం కోసం చివరి రోజున సుమారు 25,000 విగ్రహాలు వచ్చే అవకాశం ఉందని ఆనంద్ పేర్కొన్నారు. ఇంత భారీ స్థాయిలో జరిగే ఈ ఉత్సవానికి ఎలాంటి తొక్కిసలాటలు జరగకుండా భద్రత కల్పించడం చాలా ముఖ్యమని చెప్పారు. గణేష్ ఉత్సవం, మిలాద్ ఉన్ నబీ, బోనాలు, దసరా నవరాత్రులు, హనుమాన్ ర్యాలీ, శ్రీ రామనవమి ర్యాలీ వంటి పండుగల సందర్భంగా తొక్కిసలాటలు జరగకుండా హైదరాబాద్ పోలీసులు తీసుకుంటున్న కార్యాచరణ ప్రణాళిక, సన్నాహాలు, వ్యూహాలు మరియు ఇతర చర్యల గురించి ఒక పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. ఆన్‌లైన్ అనుమతి ఫారాలు, విగ్రహాలకు జియోట్యాగింగ్, డ్రోన్‌లు, యాప్‌లు, సిసిటివిల వాడకం, అలాగే మల్టీ-ఏజెన్సీ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ వంటి సాంకేతికతను పోలీసులు ఎలా వినియోగిస్తున్నారో కూడా కమిషనర్ వివరించారు. ఈ కార్యక్రమంలో రామ్ నివాస్ సేపట్, ఐపీఎస్, కల్మేశ్వర్ సింగేన్వార్, ఐపీఎస్ మరియు పుష్ప, డీసీపీ, పాల్గొన్నారు.

## 35లక్షలకు బాలాపూర్ గణేశ్ లడ్డూ

(మొదటి పేజీ తరువాయి)

దీన్ని కర్మన్‌ఘాట్‌కు చెందిన లింగాల దశరథ గౌడ్ అనే వ్యక్తి రూ.35 లక్షలకు దక్కించుకున్నారు. వేలంలో 38 మంది భక్తులు పాల్గొన్నారు. గతేడాది ఈ లడ్డూను రూ.30.01 లక్షలకు కొలను శంకర్‌రెడ్డి దక్కించుకున్నారు. గతేడాదికంటే ఈసారి లడ్డూ ధర రూ.4.99 లక్షలు అధికంగా పలికింది. లడ్డూ విజేత దశరథగౌడ్‌ను ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ- సన్మానించింది. 'బాలాపూర్ లడ్డూ అంటే నాకు చాలా ఇష్టం. ఆరేళ్లుగా దీని కోసం ప్రయత్నిస్తున్నా. ఇన్నేళ్ల తర్వాత బాలాపూర్ లడ్డూ దక్కింది. ఎంతో సంతోషంగా ఉందని దశరథగౌడ్ పేర్కొన్నారు. బాలాపూర్ గణేశుడి లడ్డూ కోసం ఆరేళ్లుగా ప్రయత్నిస్తున్నాని లడ్డూ విజేత లింగాల దశరథ గౌడ్ పేర్కొన్నారు. ఇన్నేళ్ల తర్వాత బాలాపూర్ గణేశుడి లడ్డూ దక్కడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. బాలాపూర్ గణేశ్ అంటే తనకు చాలా ఇష్టమని, గత కొన్నేండ్ల నుంచి ఇక్కడికి వస్తున్నట్లు- పేర్కొన్నారు. ఇవాళ ఆ భగవంతుడు నాకు లడ్డూను దక్కించాడు.. చాలా సంతోషంగా ఉందని లింగాల దశరథ గౌడ్ పేర్కొన్నారు. లడ్డూ విజేత దశరథ గౌడ్‌ను ఉత్సవ కమిటీ- సన్మానించింది. రూ. 35 లక్షల నగదును ఉత్సవ కమిటీకి దశరథ గౌడ్ అందించారు. రాష్ట్రంలో ఎంతో ప్రాధాన్యత సంతరించుకున్న బాలాపూర్ గణేశుడి లడ్డూ మరోసారి భారీ ధర పలికింది. గత రికార్డులను బ్రేక్‌చేస్తూ వేలం పాటలో రూ.35 లక్షలకు కర్మాన్‌ఘాట్‌కు చెందిన లింగాల దశరథ గౌడ్ దక్కించుకున్న సంగతి తెలిసిందే. ఇది గతేడాదికంటే రూ. 4.99 లక్షలు అధికం. 2024లో బాలాపూర్ గణేశ్ ఉత్సవ సమితికి చెందిన కొలను శంకర్ రెడ్డి రూ.30.01 లక్షలకు దక్కించుకున్నారు. బాలాపూర్ గణేశుడి ఊరేగింపు తర్వాత గ్రామంలోని బొడ్రాయి వద్ద వేలం పాట నిర్వహించారు. ఇందులో మొత్తం 38 మంది పాల్గొన్నారు. వారిలో ఏడుగురు స్థానికేతరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి పాల్గొన్నారు. లడ్డూవేలం తిలకించేందుకు ప్రజలు భారీగా తరలివచ్చారు.

# కమిషన్లు రావనే పేదలకు ఇళ్లు కట్టలేదు

**● కాళేశ్వరంతో కమిషన్లు లాగారు ● రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా చేసారు ● మంత్రి పొంగులేటి ఘాటు విమర్శలు**



**వనపర్తి,సెప్టెంబర్ 6 (పిసిడబ్ల్యూ న్యూస్):** కల్వకుంట్ల కుటుంబం పదేళ్లలో భారీగా అవినీతికి పాల్పడిందని తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖామంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. పేదలకు ఇళ్లు కడితే కమిషన్లు రావని కాళేశ్రం కట్టారని అన్నారు. కేసీఆర్ ప్రభుత్వం పదేళ్లలో 8 లక్షల 19 వేల కోట్ల రూపాయల అప్పుల భారం ప్రజలపై మోపిందని ఆక్షేపించారు. శనివారం వనపర్తి జిల్లాలోని పెద్దమందడి మండలం మంగంపల్లిలో ఇందిరమ్మ ఇండ్లకు గృహప్రవేశం చేశారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వాకిటి శ్రీహరి, జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే తూడి మెగారెడ్డి, కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడారు. కేసీఆర్ ప్రభుత్వం చేసిన అప్పులకు తమ ప్రభుత్వం నెల నెల వడ్డీలు కడుతూనే.. అభివృద్ధిని, సంక్షేమాన్ని జోడెడ్లలా ముందుకు తీసుకుపోతున్నామని ఉద్ఘాటించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని విమర్శించారు. పేదవారిని ఓటు- బ్యాంకుగా మాత్రమే చూశారని ఆరోపించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 7 లక్షల కొత్త రేషన్ కార్డులు ఇచ్చామని.. పాత రేషన్ కార్డుల్లో 17 లక్షల మంది పేర్లను చేర్చామని చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వం సంవత్సరానికి రెండువేల డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇచ్చి ఉంటే అందరికీ ఇళ్లు వచ్చేవని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఇళ్లు కడితే కమీషన్లు రావని తెలిసి మాజీ సీఎం కేసీఆర్ ఇళ్లను కట్టలేదని ఎద్దేవా చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు కడితే కమీషన్లు వస్తాయని తెలిసి ఆ ప్రాజెక్టును చేపట్టారని విమర్శించారు. కాళేశ్వరంలో కేసీఆర్ ప్రభుత్వం భారీగా అవినీతికి పాల్పడిందని ఆరోపించారు. రాబోయే మూడు విడతల్లో ప్రతి గ్రామంలో అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా డబుల్ బెడ్ రూం ఇళ్లు కట్టిచ్చి ఇస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హామీ ఇచ్చారు.

# ఎస్ఆర్ యూనివర్సిటీకి ఎన్ఐఆర్ఎఫ్ ఇంజనీరింగ్ కేటగిరీలో ఆలిండియా 91వ ర్యాంక్

**ఇంజనీరింగ్ కేటగిరీలో వరుసగా నాలుగో ఏడాది కూడా 100 లోపు స్థానం**

**హన్మకొండ సెప్టెంబర్ 06(పిసిడబ్ల్యు న్యూస్):** ఎస్సార్ యూనివర్సిటీ మరోసారి తన ప్రతిభను చాటుకొని, భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యం లో నిర్వహించిన జాతీయ సంస్థాగత ర్యాం కింగ్ ఫ్రేమ్‌వర్క్ 2025 లో ఇంజనీరింగ్ కేటగిరీలో 91 వ ర్యాంక్‌ను సాధించింది. వరుసగా నాలుగో ఏడాది టాప్ 100లో చోటు దక్కిం చుకోవడం ద్వారా విద్యా నాణ్యత, పరిశోధన, ఆవిష్కరణలపై ఎస్సార్ విశ్వ విద్యాలయం పట్టును మరోసారి రుజువు చేసు కుంది. ఎస్ఆర్ విశ్వ విద్యాలయం చాన్సలర్ ఎనగందుల వరద రెడ్డి ప్రెస్ మీట్‌లో మాట్లాడుతూ విద్యా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ర్యాంకింగ్స్ 2025 ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్ఆర్ యూనివర్సిటీ ఇంజనీరింగ్ కేటగిరిలో 91వ ర్యాంక్, యూనివర్సిటీ




కేటగిరీలో 101-150 బ్యాండ్లో స్థానం సంపాదించడం గర్వకారణ మని తెలంగాణ లోని ప్రైవేట్ సంస్థలలో ఇంజ నీరింగ్ కేటగిరీలో టాప్ 100 లో స్థానం పొందిన ఏకైక సంస్థ ఎస్ఆర్ విశ్వ విద్యాలయం మాత్రమేనని వరుసగా నాలుగో ఏడాది ఈ ప్రతిష్టాత్మక ర్యాంక్ దక్కించుకోవడంలో విశ్వ విద్యాలయం అధ్యాపక బృందం విద్యార్థుల కృషి ఉందని పేర్కొన్నారు.వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ దీపక్ గార్గ్ మాట్లాడుతూతెలంగాణ లోని ప్రైవేట్ విశ్వ విద్యాలయాల మధ్య ఎస్ఆర్ విశ్వ విద్యాలయం అగ్రస్థానంలో నిలిచిందని ఇన్నోవేషన్, క్రియేటివిటీ, ఆంత్రప్రెన్యూర్షిప్ విలువల ను పాఠ్యాంశంలో భాగంగా చేసుకోవడంతో పాటు, బలమైన అధ్యాపక బృందం, సమర్థవంతమైన పరిశోధన ఫలితంగా 5000ం పరిశోధన పత్రాలు, 1000ం పేటెంట్లు, 50ం పేటెంట్లు పొందినట్లు, 50ం పరిశోధన ప్రాజెక్టుల ద్వారా 15 కోట్ల నిధులు, అలాగే మైక్రోసాఫ్ట్ నుండి 51 LPA వంటి అత్యుత్తమ ప్లేస్‌మెంట్ అవకాశాలు సాధ్యమయ్యాయి అని తెలిపారు. ఈ కార్యక్రమం లో ప్రో వైస్ ఛాన్సలర్ డా.. వి. మహేష్, రిజిస్ట్రార్ డా.. ఆర్. అర్చన రెడ్డి, వివిధ స్కూల్స్ డీయా న్స్,వివిధ విభాగాల హెడ్స్, అధ్యాపకులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమకారుడు జిట్టా బాలకృష్ణారెడ్డి ప్రథమ వర్ధంతి





**భూదాన్ పోచంపల్లి,సెప్టెంబర్ 06 (పిసిడబ్ల్యు న్యూస్):** భువనగిరి ఖిల్లా నుండి ఢిల్లీ కోట వరకు తెలంగాణ ఉద్యమాన్ని నడిపించిన తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు స్వర్గీయ జిట్టా బాలకృష్ణారెడ్డి ప్రథమ వర్ధంతిని జిట్టా అభిమానులు పోచంపల్లిలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేయడంతో పాటు భువనగిరి చివరస్తాలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ భువనగిరి నియోజకవర్గంలో మూసి కలుషిత జలాల నుండి విముక్తి కల్పించేందుకు మొట్టమొదటిసారిగా ప్యూరిఫైడ్ వాటర్ ఫిల్టర్లను ఏర్పాటు చేసి సుజల ధాతగా పేరొందిన వ్యక్తి జిట్టా బాలకృష్ణారెడ్డి అన్నారు. తెలంగాణ ఉద్యమంలో భువనగిరి జిల్లాకు విద్యుత్ అలంకరణ చేయడంతో పాటు ఢిల్లీలో ధూంధాం నిర్వహించి తెలంగాణ సత్తాను చాటిన గొప్ప నాయకుడు జిట్టా అన్నారు. ఆయన లేని లోటు ఎవరూ తీర్చలేనిదని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో జిట్టా బాలకృష్ణారెడ్డి అభిమానులు రామిడి నరేందర్ రెడ్డి, రామిడి యాదిరెడ్డి, ముద్దం సత్యం యాదవ్, కొమ్ము భానుచందర్, రావుల యాదగిరి, బాలం రామకృష్ణ, చేరాల నిఖిల్, గంగాదేవి లింగస్వామి, గడ్డమీది నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

# కాజీపేట బిల్డింగ్ పెయింటింగ్ మేస్త్రి వర్కర్స్ యూనియన్ నుంచి ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు

**కాజీపేట సెప్టెంబర్ 06 (పిసిడబ్ల్యు న్యూస్):** భవన నిర్మాణ కార్మికుల కోసం తెలంగాణ ప్రభుత్వం ఇటీవల ఎక్స్‌గ్రేషియా ప్రకటించడం పట్ల కాజీపేట బిల్డింగ్ పెయింటింగ్ మేస్త్రి వర్కర్స్ యూనియన్ ఆనందం వ్యక్తం చేసింది. ఈ నిర్ణయం వలన కార్మిక కుటుంబాలకు ఆర్థిక భరోసా లభిస్తుందని యూనియన్ ప్రతినిధులు పేర్కొన్నారు.ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకట్ స్వామి, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, భవన నిర్మాణ కార్మికుల సమస్యల పట్ల చూపిన స్పందనకు యూనియన్ తరఫున కృతజ్ఞతలు తెలిపారు. కూలీల సమస్యలు పరిష్కార దిశగా ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం సమాజంలోని అట్టడుగు వర్గాలకు ఊరట కలిగిస్తుందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు గబ్బెట ఎల్లేష్ మాట్లాడుతూ, ఇకపై భవన నిర్మాణ కార్మికులు కష్టాల్లో ఉన్నప్పుడు ప్రభుత్వం తోడుగా ఉంటుందన్న నమ్మకం కలిగింది అన్నారు. ప్రధాన కార్యదర్శి కనకం శివకుమార్ మాట్లాడుతూ,కార్మికుల సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ప్రశంసనీయం అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ,ముఖ్య సలహాదారులు బస్కే రాజు, ఇనుగాల సతీష్, బొల్లె శ్రీనివాస్, కోశాధికారి షేక్ జలీల్ అహ్మద్, కీర్తి సురేష్, ఉపాధ్యక్షులు దార్ల రాజకుమార్, సంద్ర లాజర్, ఆవారా లక్ష్మణ్, సంయుక్త కార్యదర్శులు ఇల్లందుల ఐలేష్, సిరిసపల్లి శ్రీనివాసరావు, సిద్ధాంతి విల్సన్, ఆర్గనైజర్లు మంద రాజ్ కుమార్, తిరుపతయ్య, కనకం అనిల్ తదితరులు పాల్గొని కృతజ్ఞతలు తెలిపారు.




## కల్వల గ్రామంలో మహిళా భక్తులు ఏర్పాటు చేసిన గణపతి ప్రత్యేక పూజల్లో సమ్మి గౌడ్

**కేసముద్రం, సెప్టెంబర్ 06 (పిసిడబ్ల్యు న్యూస్):** కేసముద్రం మండలం కల్వల గ్రామంలో శ్రీ వరసిద్ధి వినాయక ఆధ్వర్యంలో మహిళలు ఏర్పాటుచేసిన ఏకదంతుని ప్రత్యేక పూజలకు ముఖ్య అతిథిగా హాజరై వారి ఆహ్వానం మేరకు గణనాథుని ప్రత్యేక పూజల్లో కాంగ్రెస్ మండల నాయకులు సమ్మి గౌడ్ ఫౌండేషన్ అధినేత చిలువేరు సమ్మయ్య గౌడ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా సమ్మి గౌడ్ ప్రత్యేక పూజలు చేసి ఆ వినాయకుని ఆశీర్వాదాలు కరుణ కటాక్షాలు నాతోటి అక్కాచెల్లెళ్లకు వారి కుటుంబాలకు ఎల్లవేళలా ఉండాలని కోరారు. అనంతరం మహిళా భక్తులు మాట్లాడుతూ... మేము అడిగిన వెంటనే స్పందించి ప్రతి సంవత్సరం విగ్రహ దాతగా ఉంటానని చెప్పి విగ్రహం ఇప్పించి ఎల్లవేళలా మాకు సహాయ సహకారాలు అందిస్తున్న మా సోదరుడు సమ్మి గౌడ్ కు మా నుండి అన్ని విధాల సహకారం ఉంటుందని,వారు వారి కుటుంబం ఆయురారోగ్యాలతో,అష్టైశ్వర్యాలతో, సుఖసంతోషాలతో సంపన్నులై ఉండే విధంగా ఆ వినాయకుని ఆశీర్వాదం నిండు నూరేళ్లు ఉండాలని కోరుకున్నారు.ఈ కార్యక్రమంలో వరసిద్ధి వినాయక మహిళా భక్తులు,తదితరులు పాల్గొన్నారు.



# శ్రీ వేద పాఠశాలలో గురుపూజోత్సవం



**శాయంపేట,సెప్టెంబర్ 6 (పిసిడబ్ల్యు న్యూస్):** శాయంపేట మండలం పెద్ద కొడపాక గ్రామంలోని శ్రీవేద పాఠశాలలో శనివారం గురుపూజోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విజయ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.కార్యక్రమం ప్రారంభంలో సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు తమ గురువులకు దుస్తులు బహుకరించి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా విద్యార్థులు సంస్కృత సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించి అందరినీ ఆకట్టుకున్నారు.పాఠశాలలో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు బ్యాడ్జీలు అలంకరించి, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రియాంక, కీర్తి రెడ్డి, వేద, సౌందర్యతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

# నవయుగ కాలనీలో ఘనంగా నవరాత్రి వేడుకలు





**వరంగల్, సెప్టెంబర్ 06(పిసిడబ్ల్యు న్యూస్):** వరంగల్ నగరంలోని దేశాయిపేట రోడ్డులో ఉన్నటువంటి నవయుగ కాలనీలో ఘనంగా నవరాత్రి వేడుకలు నిర్వహించారు. వినాయక చవితి సందర్భంగా తొమ్మిది రోజులు రోజుకు ఒక్క ప్రసాద రూపంలో ధూపదీప నైవేద్యాలు సమర్పించడం జరిగింది. ఇందులో భాగంగా హోమం, కుంకుమ పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ కాలనీలో ఉన్నటువంటి మహిళా సోదరీమణులు అందరూ ఒకే డ్రెస్ కోడు రూపంలో నృత్యాలు చేశారు. కోలాటంతో పాటలు పాడుతూ కోలాటం వేసినారు. మగవారు డ్రెస్ కోడ్ ధరించి భక్తిశ్రద్ధలతో బొజ్జ గణపయ్యను దర్శించుకోవడం జరిగింది. కాలనీలో తొమ్మిది రోజులపాటు ఆర్కెస్ట్రా కల్చరల్ ప్రోగ్రామ్స్ నిర్వహించడం జరిగింది. నవయుగ కాలనీ వాసులందరూ భక్తిశ్రద్ధలతో పూజలు చేసి బొజ్జ గణపయ్యను నిమజ్జనానికి తరలించడం జరిగింది. జై బోలో గణేష్ మహరాజ్ కి జై అంటూ నినాదాలు చేస్తూ గంగమ్మ ఒడికి చేర్చారు.


# జమాతే-ఇస్లామీ హింద్ అదర్యంలో సీరత్-ఉన్-నబి (స.అ.స.అ) సమావేశం.






**వరంగల్. సెప్టెంబర్ 06 (పిసిడబ్ల్యు న్యూస్):** అప్నా వరంగల్, జమాతే-ఇస్లామీ హింద్ ఖాజీపేట మరియు సుబేదారి ఆధ్వర్యంలో హనుమకొండలోని రాయల్ ఫంక్షన్ హాల్‌లో "సీరత్-ఉన్-నబి (స.అ.స.అ)" అనే అంశంపై ప్రతిష్టాత్మక సమావేశం జరిగింది.ఈ కార్యక్రమంలో ప్రముఖ పండితులు, వక్తలు సీరత్-ఎ-రసూల్ (స.అ) జీవితం మరియు బోధనలపై ప్రసంగించారు. ప్రవక్త హజ్రత్ మహ్మద్ (స.అ.స.అ) జీవితం సమాజానికి శాంతి, న్యాయం మరియు సోదరభావానికి మార్గదర్శకమని, ఆయన ఉపదేశాలను అనుసరించడం ద్వారా ఇహలోకంలో మరియు పరలోకంలో విజయాన్ని సాధించవచ్చని పేర్కొన్నారు.ఈ సమావేశంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొనడం విశేషం. చివరగా సామూహిక ప్రార్థన జరిపి, నిర్వాహకులు పాల్గొన్న వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ఇచ్చిన అనుగ్రహంతో ఈ సమావేశం విజయవంతమైందని, ఇది మతపరమైన మార్గదర్శకత్వంలో ఒక ముఖ్యమైన కార్యం అని నిర్వాహకులు అభివర్ణించారు.

# మిలాద్-ఉన్-నబీలి వెడుకలో నన్నపునేని నరేందర్..



**వరంగల్.సెప్టెంబర్ 06 (పిసిడబ్ల్యు న్యూస్):** ముస్లింలు పవిత్రంగా భావించే మిలాద్-ఉన్-నబీ ని శుక్రవారం వేడుకగా జరుపుకున్నారు. మహమ్మద్ ప్రవక్త జన్మదిన సందర్భంగా ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తారు. మండి బజార్ జెండా గద్దె వద్ద జెండా కమిటీ నిర్వాహకులు ఎంఏ బాసిత్ తాహెర్ ఆధ్వర్యంలో ఘనంగా మహమ్మద్ ప్రవక్త 1500వ పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గ్రేటర్ వరంగల్ తొలి మేయర్ మరియు వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్. ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. అనంతరం జెండా కమిటీ సభ్యులు లిమొహమ్మద్ అబ్దుల్ బాసిబ్ తాహెర్. నన్నపునేని నరేందర్ ని శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందించి సన్మానించినారు ఈ కార్యక్రమంలో మైనారిటీ మత పెద్దలు మరియు కమిటీ సభ్యులు, మైనారిటీ సోదరులు పాల్గొన్నారు

# టిజిఎన్పిడిసిల్ అసోసియేషన్ కంపెనీ సెక్రటరీగా దిలీప్ కుమార్



**వరంగల్,సెప్టెంబర్ 06 (పిసిడబ్ల్యు న్యూస్):** వరంగల్ ఉమ్మడి జిల్లా తొర్రూర్ ప్రాంతానికి చెందిన మడిపెద్ది దిలీప్ కుమార్ టి జి ఎన్ పి డి సి ఎల్ ఏ ఈ కంపెనీ సెక్రటరీ గా ఎన్నికయ్యారు. ఈనెల రెండవ తేదీన స్టేట్ వారిగా నాలుగు కంపెనీల ఎన్నికలు జరగగా శుక్రవారం ప్రకటించిన ఎన్నికల ఫలితాలలో టీజీడీసీఎల్ కంపెనీ సెక్రటరీగా మడిపెద్ది దిలీప్ కుమార్ విజయం సాధించారు ఇతను ప్రస్తుతం గొర్రెకుంట ఏఈగా విధులు నిర్వర్తిస్తున్నారు. వైస్ ప్రెసిడెంట్ గా నవీన్ జగిత్యాల ఏఈగా,జాయింట్ సెక్రటరీ గా సిహెచ్ నవీన్ నయీమ్ నగర్ ఏఈగా ప్రస్తుతం పని చేస్తున్నారు. వీరికి ఏఈలు అధికారులు పలువురు నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు.

# గణేష్ లడ్డూ ప్రసాదం వేలం పాట

**వేలం పాటలో ఆసక్తి కనబరిచిన భక్తులు**

**22వేల 5 వందల రూ.లకు చేజిక్కించుకున్న టాగూర్**



**గంగాధర, సెప్టెంబర్ 06, (పిసీడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలం మధురానగర్ చౌరస్తాలోని అవిజ్ఞ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రతిష్ఠించిన గణపతి చేతిలో పదకొండు రోజుల పాటు పూజలు అందుకున్న లడ్డు ప్రసాదాన్ని వేలం పాటలో చేజిక్కించుకునేందుకు భక్తులు ఆసక్తి కనబరిచారు. గ్రామంలోని యువకులు వేలం పాటలో అధిక సంఖ్యలో పాల్గొని పోటా పోటీగా వేలాన్ని పెంచుతూ ఉత్సాహాన్ని కనబరిచారు. గంగాధర గ్రామానికి చెందిన సంతోషి – రవీంద్రనాథ్ టాగూర్ దంపతులు 22వేల 5 వందల రూ.లకు చేజిక్కించుకున్నారు. రవీంద్రనాథ్ టాగూర్ ఆయన కుమారుడు ఉద్భవ్ టాగూర్, సాయిచరణ్ టాగూర్ ను అవిజ్ఞ యూత్ అసోసియేషన్ సభ్యులు శాలువాతో సన్మానించారు.

## కార్గో పార్సిల్స్ సర్వీస్ నడిపించుటకు

# దరఖాస్తుల ఆహ్వానం



**పరకాల, సెప్టెంబర్ 6 (పిసిడబ్ల్యూ న్యూస్):**

పరకాల ఆర్టీసీ బస్టాండ్లో కార్గో పార్సిల్ సర్వీసులు నడిపించడం కొరకు దరఖాస్తుల ఆహ్వానం. కార్గో పార్సిల్ సర్వీస్ నడిపించుటకు ఉత్సాహంగా ఉన్న యువకులు పరకాల డిపో మేనేజర్ ఆఫీస్ నందు సంప్రదించగలరు.ఈ యొక్క సువర్ణ అవకాశాన్ని యువకులు, నిరుద్యోగులు సద్వినియోగించు కోగలరు.గమనిక: మీయొక్క అప్లికేషన్ ఫామ్స్ 12- 9-2025 లోపు ఆఫీస్ నందు ఇవ్వగలరని పరకాల డిపో మేనేజర్ ఒక ప్రకటనలో తెలియజేశారు.

# సమాజ సేవలో జర్నలిస్టుల పాత్ర కీలకం

**- జర్నలిస్ట్ డే సందర్భంగా సన్మానం**



**హుజూర్ నగర్ సెప్టెంబర్ 06 (పిసిడబ్ల్యూ న్యూస్):** సమాజ సేవలో జర్నలిస్టుల పాత్ర చాలా కీలకమైందని వాసవి వనిత వాసవి క్లబ్ నాయకులు వెంపటి వెంకటేశ్వరరావు, ఓరుగంటి నాగేశ్వరరావు, పలిశెట్టి నరసింహారావు, దాసరి నాగేశ్వరరావు అన్నారు. శనివారం జర్నలిస్టుల డే సందర్భంగా స్థానిక వాసవి భవనంలో జర్నలిస్టులను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో ఒడిదుడుకులను అధిగమించి ప్రజలకు ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తున్న జర్నలిస్టులకు కృషి మరువలేని అన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా జర్నలిస్టు లో ఇంకా చైతన్యవంతంగా ఉన్నారని వారి ద్వారా ఎన్నో విషయాలు తెలుస్తున్నాయని వారన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య నాయకులు బచ్చు రామారావు, పేరూరి అశోక్, శ్రీమన్నారాయణ, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, మురళి, జర్నలిస్టులు కోల నాగేశ్వరరావు, పిల్లలమర్రి శ్రీనివాస్, దేనుమకొండ శేషం రాజు ,ఉషశ్రీ ,రాంప్రసాద్, శ్రీనివాస చారి, ఓగ్గు విశాఖ, వెంకటేష్, ఇందిరాల రామకృష్ణ ,అంజి ,బండి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు...

- **కబడ్డీ క్రీడోత్సవాల ప్రారంభ కార్యక్రమంలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి**
- **అట్టహాసంగా మానేరులో అర్బన్ ఎస్జీఎఫ్ కబడ్డీ పోటీలు ప్రారంభం.**







**కరీంనగర్,సెప్టెంబర్6(పీసీడబ్ల్యూ న్యూస్):** ప్రస్తుత కాలంలో విద్యార్థులకు క్రీడలతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. శనివారం కరీంనగర్ అర్బన్ క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో మానేరు విద్యాసంస్థల సౌజన్యంతో కరీంనగర్ పద్మనగర్‌లోని మానేరు సీబీఎస్ఈ పాఠశాలలో నిర్వహించిన ఎస్జీఎఫ్ అర్బన్ కబడ్డీ పోటీలను ఆయన లాంచనంగా ప్రారంబించారు. అంతకుముందు ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడా పతాకాన్ని ఆవిస్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యతను ఇస్తుందన్నారు. నూతన క్రీడా పాలసీతో పాటు స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తుండడం గర్వకారణమన్నారు. జిల్లాలో మానేరు విద్యాసంస్థలు క్రీడారంగాని చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా విద్యాసంస్థల ఆధ్వర్యంలో జాతీయ, రాష్ట్ర పోటీలు జరుగడం ఆనందించదగ్గవిషయమన్నరు. క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ పోటిల్లో రాణించి జిల్లాకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు. సుడా పరంగా జిల్లాలో క్రీడారంగ అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. మానేరు విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి మాట్లాడుతూ విద్యాసంస్థల ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాఠశాలలో విద్యతో పాటు క్రీడలకు సముచిత స్థానాన్ని కల్పిస్తున్నట్లు తెలిపారు. క్రీడల్లో రాణించిన వారు అన్ని రంగాల్లో రాణిస్తారన్నారు. భవిష్యత్‌లో మానేరు విద్యాసంస్థల ఆధ్వర్యంలో జాతీయ పోటీల నిర్వాహణకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. అనంతరం సుడా చైర్మన్ క్రీడాకారులు పరిచయం చేసుకొని పోటీలను ప్రారంబించారు. ఈ సందర్భంగా ఆయన కాసేపు అతిథులతో సరదాగా కబడ్డీ ఆడి సందడి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి వి శ్రీనివాస్ గౌడ్, ఒలంపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్ధన్ రెడ్డి, ఉపాధ్యాక్షులు తుమ్మల రమేశ్ రెడ్డి, ఎస్జీఎఫ్ కార్యదర్శి వేణు గోపాల్, తెలంగాణ కబడ్డీ సంఘం ఉపాధ్యాక్షులు సీహెచ్ సంపత్ రావు, పెటా టీఎస్ అధ్యక్ష కార్యదర్శులు బాబు శ్రీనివాస్, ఆడేపు శ్రీనివాస్, అర్బన్ ఎస్జీఎఫ్ కార్యదర్శి అంతటి శంకరయ్య, సైక్లింగ్, వుషు క్రీడా సంఘాల అధ్యక్షులు బుర్ర మధుసూదన్ రెడ్డి, బార విద్యాసాగర్, పీఈటీఏ అధ్యక్ష కార్యదర్శులు బత్తిని శ్రీధర్, దారం గౌతం రెడ్డి తో పాటు పీడీ, పీఈటీలు సిలివేరి మహేందర్, కూరపాటి లక్ష్మీనారాయణ, ఆనంద్, శ్రీధర్ రెడ్డి, చిరంజీవి, లింగారావు, తదితరులు పాల్గొన్నారు.

# జీఎస్టీపై మోడీ ప్రభుత్వం తీసుకున్నది సంచలన నిర్ణయం...

**- దేశానికి స్వాతంత్రం వచ్చాక ప్రజలందరూ ఉపయోగించుకునే 80 శాతం వస్తువులపై ద టాక్స్ తగ్గింపు ఇదే మొదటిసారి...**

**- నిత్యావసర వస్తువులకు 5 శాతం సాధారణ వస్తువులకు 18 శాతం, విలాసవంతమైన, హానికరమైన వస్తువులకు 40 శాతం తో జిఎస్టిలో మార్పులు.**

**- నాలుగు పన్ను శ్లాబులను రద్దు చేసి,ఒక సరళమైన మూడు అంచెల విధానాన్ని తీసుక వచ్చి, పన్ను భారాన్ని తగ్గించిన ప్రధాని మోడీకి, కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు...**

**- బిజెపి జిల్లా అధికార ప్రతినిధి, సెంట్రల్ ఫిలిం సెన్సార్ బోర్డ్ సభ్యులు బొంతల కళ్యాణ్ చంద్ర**

**కరీంనగర్ జిల్లా,సెప్టెంబర్6(పీసీడబ్ల్యూ న్యూస్):** భారత ప్రభుత్వం సెప్టెంబర్ 2025లో ప్రకటించనున్న గూడ్స్ అండ్ సర్వీస్ టాక్స్ ( జిఎస్టి ) రేట్ల తగ్గింపులు దేశ ఆర్థిక విధానానికి, వినియోగదారుల ఖర్చులలో ఒక కొత్త అధ్యాయానికి నాంది పలకనున్నాయని బిజెపి జిల్లా అధికార ప్రతినిధి, సెంట్రల్ ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యులు బొంతల కళ్యాణ్ చంద్ర అన్నారు. శనివారం రోజున కరీంనగర్లో ఆయన మాట్లాడుతూ దేశానికి స్వాతంత్రం వచ్చాక ప్రజలందరూ ఉపయోగించుకునే 80 శాతం వస్తువులపై టాక్స్ తగ్గింపు ఇదే మొదటిసారి అని తెలిపారు. ముఖ్యంగా గతంలో ఉన్న నాలుగు పన్ను శ్లాబులను రద్దు చేసి, ఒక సరళమైన మూడుఅంచెల విధానాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిందని, నిత్యావసర వస్తువులకు 5 శాతం, సాధారణ వస్తువులకు 18 శాతం, విలాసవంతమైన, హానికరమైన వస్తువులకు 40 శాతం తో జిఎస్టి వర్తించేలా మార్పులు చేపట్టి, ప్రజలకు, వినియోగదారులకు మేలు జరిగేలా మోడీ ప్రభుత్వం చారిత్రక నిర్ణయం తీసుకుందన్నారు. ఈ నిర్ణయం వల్ల భారతీయ ప్రజలందరికీ,వినియోగదారులకు, వ్యాపారాలకు నేరుగా ప్రయోజనం చేకూర్చనుందన్నారు. ప్రధానంగాగతంలో అత్యధికంగా ఉన్న 28 శాతం శ్లాబును పూర్తిగా తొలగించారని, పాన్ మసాలా, గుట్కా, సిగరెట్లు, బీడీలు, లగ్జరీ వస్తువులు, జూదం వంటి కొన్ని వస్తువులకు మాత్రమే 40 శాతం జిఎస్టి వర్తించనుందని తెలిపారు. గృహోపకరణాలు వంటి వాటిపై జీఎస్టీ 12 శాతం, 18 శాతం నుండి కేవలం 5 శాతం కి తగ్గిందన్నారు. టీవీలు, ఏసీలు, రిఫ్రిజిరేటర్లు, వాషింగ్ మెషిన్ల వంటి ఉపకరణాలపై గతంలో ఉన్న 28 శాతం జీఎస్టీ ఇప్పుడు 18 శాతం కి తగ్గిందని , దీంతో ఈ వస్తువులు గణనీయంగా చౌకగా లభించనున్నాయన్నారు. హెల్త్ సెక్టార్ లో ప్రజలకు ఊరట నిచ్చే విధంగా మార్పులు జరిగాయని,మెడిసిన్స్ ఇకపై చౌకగా లభించనున్నాయన్నారు. జీవిత, ఆరోగ్య బీమా పాలసీలకు జీఎస్టీ నుంచి మినహాయింపు లభించడం గొప్ప విషయమన్నారు. ఈ రేట్ల తగ్గింపుల వల్ల కేంద్ర ప్రభుత్వం ఏటా వేల కోట్ల ఆదాయం కోల్పోతున్న ప్రజల మేలు, సంక్షేమం కోసం మాత్రమే మోడీ ప్రభుత్వం ఆలోచన చేసి జిఎస్టిలో పెనుమార్పులు చేపట్టిందన్నారు. ముఖ్యంగా నిత్యావసర వస్తువులపై పన్నులు తగ్గించడం వల్ల వినియోగదారుల చేతిలో డబ్బు మిగిలి, డిమాండ్ పెరుగుతుందని, దేశీయ మార్కెట్లు మరింత ఆకర్షణీయంగా మారి, దేశీయ వస్తువులకు డిమాండ్ పెరిగి, ఉత్పత్తిదారులకు, వ్యాపారులకు తగిన మద్దతు లభిస్తుందన్నారు. అలాగేప్రపంచ వ్యాపారాలకు భారత మార్కెట్ ఒక ఆకర్షణ గా నిలవబోతుందన్నారు.



ప్రధానంగా మోడీ ప్రభుత్వం అంతర్జాతీయ సుంకాల ప్రభావాన్ని తట్టుకోవడానికి, దేశ ఆర్థిక స్థిరత్వాన్ని బలోపేతం చేయడానికి ప్రయత్నిస్తు, వినియోగదారుల పన్ను భారాన్ని తగ్గించడానికి చర్యలు చేపట్టిందన్నారు. రాబోయే కొన్ని నెలల్లో ఈ సాహసోపేతమైన సంస్కరణలు ఎంత ప్రభావవంతం గా ఉంటాయో ప్రపంచ దేశాలకు అర్థమవుతుందన్నారు. జీఎస్టీ పై సంచలన నిర్ణయం తీసుకొని, ప్రజలకు వినియోదారులకు పన్ను భారాన్ని తగ్గించిన ప్రధాని మోదీ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్,కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు ఆయన ఈ సందర్భంగా చెప్పారు.

# కేంద్ర మంత్రి బండి సంజయ్ సొంత నిధులతో వేములవాడ ఆసుపత్రికి అంబులెన్స్ అందజేత...

- **ఆసుపత్రి అధికారులకు అంబులెన్స్‌ను అందజేసిన బీజేపీ వెహికల్ ఇంఛార్జ్ సాంబాయిపల్లి**



**కరీంనగర్ జిల్లా,సెప్టెంబర్6(పీసీడబ్ల్యూ న్యూస్):** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తన సొంత నిధులతో వేములవాడ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి అంబులెన్స్ ను అందించారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ వెహికల్ ఇంఛార్జ్ సాంబాయిపల్లి శ్రీనివాసరెడ్డి ఈరోజున అంబులెన్స్ తోపాటు వాటికి సంబంధించిన పత్రాలను వేములవాడ ప్రభుత్వ ఆసుపత్రి అధికారులకు అందజేశారు. వేములవాడ నియోజకవర్గంలో రోగులకు అత్యవసర సేవలు అందించేందుకు ఈ అంబులెన్స్ ఎంతగానో ఉపయోగపడనుంది. బండి సంజయ్ గతంలోనూ వేములవాడసహా కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ ఆసుపత్రులకు పెద్ద ఎత్తున వైద్య పరికరాలను అందించారు. గతంలో తన పుట్టినరోజు సందర్భంగా సొంత ఖర్చులతో వివిధ ప్రభుత్వ ఆసుపత్రులకు రూ.3 కోట్ల విలువ గల వైద్య పరికరాలను అందించారు. కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి పెద్ద ఎత్తున మెడికల్ ఎక్విప్ మెంట్లను అందించారు. కరోనా సమయంలోనూ వేలాదిమందికి రెమిడిసివర్ ఇంజక్షన్లను, పీపీఈ కిట్లను అందజేసి ప్రాణం పోశారు. బీజేపీ సురక్షా పేరిట వేలాది మందికి ఉచితంగా కాన్సన్ట్రేటర్స్, రక్త దానం చేశారు. త్వరలోనే కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్ బిలిటీ (సీఎస్సార్) కింద దాదాపు రూ.5 కోట్ల విలువైన వైద్య పరికరాలను అందించేందుకు ప్రతిపాదనలను కూడా సిద్ధం చేశారు. అతి త్వరలోనే ఆయా పరికరాలను వేములవాడసహా పలు ప్రభుత్వ ఆసుపత్రులకు అందించనున్నారు.

# జాతీయ మాలమహానాడు కరీంనగర్ జిల్లా అసెంబ్లీ నియోజవర్గ ఇంచార్జీల నియామకం





**కరీంనగర్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 6 (పీసీడబ్ల్యు న్యూస్):** జాతీయ మాలమహానాడు తెలంగాణ రాష్ట్రం కరీంనగర్ జిల్లా అసెంబ్లీ(4)నియోజక వర్గాలకు మాలమహానాడు ఇంచార్జీలను రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ గారి ఆదేశాలను అనుసరించి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు కాడే శంకర్ నియామకం చేయడం జరిగింది. నూతనంగా నియమించిన ఇంచార్జి బాధ్యులు వారి నియోజక వర్గ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ముట్టడిని తేదీ:08.09.2025న, ఉదయం:9 గంటలకు, రాష్ట్ర కమిటిపిలుపుమేరకు క్యాంపు కార్యాలయ ముట్టడి కారిక్రమం విజయవంతం చేయుటకు మాలలు పెద్దయెత్తున పాల్గొనుటకు కృషి చేయాలని కోరుతూ.. పిలుపు ఇవడమైనది..నియోజవరం.ఇంచార్జి 1)కరీంనగర్. ఇరుకుల్లయదగిరి 2) చొప్పదండి. కునమల్లచంద్రయ్య 3)మానకొండూర్. లింగంకుమార్4) హుజురాబాద్. జూపాలశ్రీనివాస్‌లను నియమించడమైనది.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కాడే శంకర్,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడి అంజయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎలుక ఆంజనేయులు,జిల్లా నాయకుడు దామెర సత్యం, బొల్లం వెంకటస్వామి,పల్నాటి చంద్రయ్య,రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.


# సిఎస్ఆర్ నిధులతో చేపట్టనున్న మౌలిక సదుపాయాల కల్పన పై సమీక్ష సమావేశం

**ముఖ్య అతిథిగా పాల్గొన్న వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ.**



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 06 (పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా సంగారెడ్డి లోని జడ్పీ కార్యాలయంలో జిల్లాలో ఉన్న కేజీబీవీ, మోడల్ స్కూల్స్ , రెసిడెన్షియల్ పాఠశాలల లో CSR నిధులతో చేపట్టనున్న మౌలిక సదుపాయాల కల్పన పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాలో ఉన్న కేజీబీవీ,మోడల్ స్కూల్స్, రెసిడెన్సియల్ పాఠశాలలలోని విద్యార్థుల హాస్టల్ నిర్వహణకు అవసరమైన సదుపాయాల కల్పన, బెడ్స్, కిచెన్ సామాగ్రి, టేబుల్స్, ప్లేట్స్, బుక్స్, డిజిటల్ క్లాస్ రూమ్స్ ఏర్పాటు, స్పోర్ట్స్ కిట్స్ వంటి మౌలిక సదుపాయాల కల్పన పై CSR నిధులతో జిల్లాలో చేపట్టే పనులపై నివేదిక ను సమర్పించాలని అధికారులకు మంత్రి దామోదర్ రాజనర్సింహా దిశానిర్దేశం చేశారు. జిల్లాలో ఉన్న కేజీబీవీ, మోడల్ స్కూల్స్, రెసిడెన్సియల్ పాఠశాలలలోని విద్యార్థులకు కార్పొరేట్ స్కూల్స్ కు ధీటుగా ప్రభుత్వ రంగం లోని స్కూల్స్ లలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా , వైద్య రంగాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు మంత్రి దామోదర్ రాజనర్సింహా.

# వరుసగా మూడోసారి లడ్డూ కైవసం చేసుకున్న బాలగౌని సాయిచరణ్ గౌడ్



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 06 (పిసిడబ్ల్యూ న్యూస్):** సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామంలో ఉన్న శ్రీ సిద్ధి వినాయక దేవాలయం గణేష్ నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణగా గణనాథుడి లడ్డూ వేలం పాట జరిగింది. మూడోసారి ఈ లడ్డూను పటాన్చెరు బీఆర్ఎస్ యువనాయకుడు బాలగౌని సాయిచరణ్ గౌడ్ సొంతం చేసుకున్నారు. ఇక్కడి లడ్డూను సాయిచరణ్ గౌడ్ 2023లో 3,50,000 రూపాయలకు సొంతం చేసుకోగా, గత ఏడాది 6,25,000 రూపాయలకు సొంతం చేసుకున్నాడు. ఈ ఏడాది మూడోసారి లడ్డూను 7,00,000 లక్షల రూపాయలకు సొంతం చేసుకున్నాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణనాథుడి లడ్డూ వరుసగా మూడోసారి మా కుటుంబానికి దక్కడం మా అదృష్టం. ఇది స్వామివారి ఆశీర్వాదంగా భావిస్తున్నాం అని అన్నారు. ఉత్సవ సమితి సభ్యులు మాట్లాడుతూ సాయిచరణ్ గౌడ్ కుటుంబంపై ఎల్లప్పుడూ గణనాథుడి కృప ఉండాలని, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని కోరుకుంటున్నాం అని తెలిపారు.

# చెన్నై తెలంగాణ సంఘం ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలో పాల్గొననున్న ప్రభుత్వ విప్ డాక్టర్ రామచంద్రనాయక్




**హైదరాబాద్, సెప్టెంబర్ 6 (పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి):** చెన్నై తెలంగాణ సంఘం ఆధ్వర్యంలో చెన్నై నగరంలో జరగబోయే తెలంగాణ ప్రజాసాంస్కృతిక పండుగ"బతుకమ్మ"లో తెలంగాణ ప్రభుత్వ విప్, డోర్నకల్ నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ జాటోత్ రామచంద్రనాయక్ ముఖ్య అతిథిగా పాల్గొననున్నారు. తెలంగాణ సంప్రదాయాలు, ఆచారాలు, సంస్కృతిని ప్రతిబింబించే ఈ పండుగకు డాక్టర్ రామచంద్రనాయక్ సమక్షం ప్రత్యేక ఆకర్షణగా నిలవనుందని సంఘం పేర్కొంది. చెన్నై తెలంగాణ సంఘం ప్రతినిధి బృందం నేడు హైదరాబాద్‌లో ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి, చెన్నై బతుకమ్మ వేడుకలకు హాజరుకావాలని ఆహ్వాన పత్రాన్న అందజేశారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే చెన్నై తెలంగాణ సంఘం ఆధ్వర్యంలో బతుకమ్మ పండుగను అత్యంత ఉత్సాహభరితంగా, వైభవంగా నిర్వహిస్తూ వస్తోంది. చెన్నైలో నివసిస్తున్న తెలంగాణ ప్రజలకు ఆత్మీయత, సాంస్కృతిక అనుబంధాన్ని పునరుద్ధరించడమే కాకుండా, ఈ వేడుక తెలంగాణ సంస్కృతికి అద్దం పడుతోంది. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు, కార్యదర్శులు మరియు సభ్యులు మాట్లాడుతూ:"బతుకమ్మ పండుగ తెలంగాణ ఆత్మీయతకు ప్రతీక. ఈసారి చెన్నైలో జరుగబోయే వేడుకల్లో డాక్టర్ జాటోత్ రామచంద్రనాయక్ పాల్గొనడం మాకు గర్వకారణం అని అన్నారు.

# గణనాధుని లడ్డును రెండు లక్షల 45 వేలకు దక్కించుకున్న యశ్వంత్

**విఘ్నేశ్వరుడి ఆశీర్వాదంతో అందరూ సంతోషంగా ఉండాలి...**



**అంబర్ పేట సెప్టెంబర్ 06 (పిసిడబ్ల్యూ న్యూస్):** అంబర్ పేట డివిజన్ పటేల్ నగర్ చౌరస్తాలో పటేల్ నగర్ దేవస్థానం కమిటీ ఆధ్వర్యంలో నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకుని సాగర్ తీరానికై బయలుదేరిన గణనాధుని లడ్డు వేలం పాటలో అంబర్ పేట బిజెపి పార్టీ కంటెస్టెడ్ కార్పొరేటర్ యశ్వంత్ 2,45,000 వేలకు లడ్డును దక్కించుకున్నారు. ఈ సందర్భంగా యశ్వంత్ మాట్లాడుతూ పటేల్ నగర్ దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నవరాత్రి ఉత్సవాలను నిర్వహించడం చాలా సంతోషంగా ఉందని, విగ్నేశ్వరుడి అనుగ్రహంతో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని విఘ్నేశ్వరుడి ఆశీర్వాదంతో లడ్డూను దక్కించుకోవడం చాలా సంతోషంగా ఉందని యశ్వంత్ అన్నారు. బిఆర్ఎస్ పార్టీ అంబర్ పేట డివిజన్ కార్పొరేటర్ విజయ్ కుమార్ గౌడ్, బిజెపి పార్టీ సీనియర్ నాయకులు బిక్షపతి, మరియు దేవస్థాన కమిటీ సభ్యులు యాదగిరి, రత్నపాని, నాగరాజ్, అనిల్, మరియు దేవస్థాన కమిటీ సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

# గురుపూజోత్సవ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించిన స్వామి వివేకానంద హై స్కూల్

**గురువు కరుణాసాగర్ రెడ్డిని ఘనంగా సన్మానించుకున్న విద్యార్థులు**




**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 06 (పిసిడబ్ల్యూ న్యూస్):** సంగారెడ్డి జిల్లా జిన్నారం మున్సిపల్ కేంద్రంలో స్వామి వివేకానంద హై స్కూల్ ఆవరణలో గురుపూజోత్సవ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకోవడం జరిగింది, ఈ కార్యక్రమంలో స్వామి వివేకానంద హై స్కూల్ వ్యవస్థాపక అధ్యక్షులు పట్లోళ్ల కరుణ సాగర్ రెడ్డి ని విద్యార్థిని విద్యార్థులు సమిష్టిగా పూలదండ శాలువాను అలంకరించి పువ్వుల రెక్కల తో గౌరవంతో ప్రేమ అనురాగాలతో నిలువెల్ల వెదజల్లి గురు పాదాలకు వందనం చేసి ఆశీర్వాదం తీసుకొని సంతోషంగా విద్యార్థులు గురుపూజోత్సవ దినోత్సవ శుభాకాంక్షలు తెలుపడం జరిగింది, అనంతరం ఉపాధ్యాయులందరికీ విద్యార్థులు పాఠశాల వ్యవస్థాపక అధ్యక్షులు కరుణాసాగర్ రెడ్డి ఘనంగా సన్మానించడం జరిగింది, ఈ సందర్భంగా పట్లోళ్ల కరుణాసాగర్ రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులకు గురుపూజోత్సవ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ, విద్యార్థిని విద్యార్థులకు ఆశీస్సులు అందిస్తూ మాట్లాడుతూ మిమ్ములను కన్న తల్లి తండ్రులు జన్మనిస్తే, బాల్యం నుండి విద్యాబుద్ధులు నేర్పి జీవితానికి స్ఫూర్తినిచ్చే వ్యక్తులే గురువులని, గురు స్థానం సమాజంలో ప్ర ప్రథమమైనటువంటిది అని, గురువుల స్థానం ప్రాధాన్యత గొప్పదని అభివర్ణించడం జరిగింది, అదేవిధంగా విద్యార్థిని విద్యార్థులు గురువులు చెప్పిన విద్యాబుద్ధులు నేర్చుకుని సమాజంలో తలెత్తుకొని ఉన్నత స్థాయికి ఎదిగి గొప్ప స్ఫూర్తిని తీసుకొచ్చి తల్లిదండ్రుల గురువుల ఖ్యాతిని సమాజానికి స్ఫూర్తినిచ్చే విధంగా ఉండాలి అన్నారు, అనేక చరిత్రను చూసిన చరిత్రలలో గురు శిష్యుల ప్రాధాన్యత గొప్ప చరిత్రను ప్రతిబింబించే విధంగా ఉంటుంది అన్నారు, ఉపాధ్యాయుల వల్లనే గత చరిత్రలో నేటి సమాజంలో విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించి సమాజానికి అన్ని రంగాల్లో స్ఫూర్తినిస్తున్నారని అన్నారు, నేడు జిన్నారం మున్సిపల్ కేంద్రంలో స్వామి వివేకనంద విద్యాలయాన్ని ప్రారంభించి వందలాది విద్యార్థిని విద్యార్థులకు నిష్ణాతులైనటువంటి అధ్యాపకుల చేత చదువులని ప్రసాదింపచేసి సమాజంలో అన్ని రంగాల్లో ఉద్యోగాలు సాధించి స్వామి వివేకానంద ఉన్నత పాఠశాలకు స్ఫూర్తిని అందిస్తున్నందుకు నేను గర్వపడుతున్నాను అన్నారు, స్వామి వివేకనంద హై స్కూల్ విద్యార్థులు అంచలంచలుగా ఎదిగి తెలంగాణ రాష్ట్రానికే స్ఫూర్తిని సాధించే విధంగా విద్యార్థులు ఎదగాలని ఆకాంక్షిస్తూ విద్యార్థులను సంతోషంతో ఆశీర్వదించి అభినందించడం జరిగింది, అనంతరం ఉపాధ్యాయు లు అందర్నీ అభినందిస్తూ విద్యార్థులకు అమ్మను మరిపించే కమ్మనైన తీరులో విద్య బోధన చేయాలని విద్యార్థులను చరిత్రలో ఉన్నత శిఖరాలకు ఎదిగే విధంగా ఉపాధ్యాయులు అన్ని రంగాల్లో స్ఫూర్తిని ఇవ్వాలన్నారు, అనంతరం పాఠశాల నిర్వాహకులు ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమంలో విద్యార్థులతో కలిసి ఉపాధ్యాయులు ఉపాధ్యాయుల కీర్తిని పాటల రూపంలో ఆటల ద్వారా అలరించడం ప్రత్యేకంగా సంచరించుకుంది, ఉపాధ్యాయులు గురుపూజోత్సవ దినోత్సవాన్ని పురస్కరించుకొని వారి వారి అమూల్యమైన సందేశాన్ని ఆశీస్సులను విద్యార్థులు సంతోషంగా స్వీకరించడం జరిగింది, ఉపాధ్యాయులకు గురుపూజోత్సవ దినోత్సవ సందర్భంగా ప్రత్యేక జ్ఞాపకాలను అందించడం జరిగింది, ఈ కార్యక్రమంలో ప్రధానో పాధ్యాయురాలు ఉపాధ్యా యులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొని కన్నుల పండుగగా కార్యక్రమాన్ని జరుపుకోవడం జరిగింది,

# సంగారెడ్డిలోని శివాజీ నగర్ మహిళలను అభినందించిన తూర్పు జయప్రకాష్ రెడ్డి

**డా.కూన వేణుగోపాలకృష్ణ తెలంగాణ రాష్ట్ర యువజన సంఘాల అధ్యక్షులు.**



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 06 (పిసిడబ్ల్యూ న్యూన్):** తెలంగాణరాష్ట్ర సాంప్రదాయబద్ధంగా జరుపుకున్న వినాయక చవితి పురస్కరించుకొని రాష్ట్ర యువజన సంఘాల సమితి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మహిళలకు ముగ్గుల పోటీలు,కూచిపూడి లాంటి సంప్రదాయ నృత్యాల పోటీలు, నిర్వహించి పోటీల్లో గెలుపొందిన మహిళలకు చిన్నారులకు బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే తూర్పు జయప్రకాశ్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర యువజన సంఘాల సమితి అధ్యక్షులు డా.కూనవేణుగోపాలకృష్ణ హాజరై బహుమతులు ప్రధానం చేసి ఈ సందర్భంగా సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే తూర్పు ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ సంగారెడ్డి శివాజీ నగర్ మహిళలను ప్రత్యేకంగా అభినందించడం జరిగింది, తెలంగాణ రాష్ట్రంలో సాంప్రదాయ బద్ధంగా భక్తిశ్రద్ధలతో జరుపుకునే పండుగలు వినాయక చవితి అని, వినాయక చవితి సందర్భంగా తెలంగాణ రాష్ట్రం సాంప్రదాయాన్ని సంస్కృతిని కాపాడే విధంగా మహిళలు ముగ్గుల పోటీలో పాల్గొని,ముగ్గులు వేసి,చిన్నారి చిన్నారులు కూచిపూడి భరతనాట్యం లాంటి సంప్రదాయ నృత్యాలను ప్రదర్శించి కన్నుల పండుగగా ఈ కార్యక్రమాన్ని కొనసాగించడం చాలా ఆనందంగా ఉంది అన్నారు, అదేవిధంగా ప్రతి ఏడూ జరుపుకునే సాంప్రదాయ వినాయక చవితివేడుకలకు ప్రాతినిధ్యం వహించిన యువతీ యువకులను సంపూర్ణంగా అభినందిస్తున్న అన్నారు, మహిళలు మన సంస్కృతి సాంప్రదాయాలను కొనసాగిస్తూ సమాజానికి స్ఫూర్తిగా ఉండే విధంగా సంకల్పంతో కంకణ బదులు కావాలన్నారు, మహిళలు తలుచుకుంటే ఏదైనా సాధించగలరని దేశ ప్రగతికి మూలం మహిళలే భవిష్యత్ తరాల్లో మహిళా స్ఫూర్తి ప్రదాతలు జగతికి మూలం మహిళలే అని అభివర్ణిస్తూ ప్రత్యేకంగా శివాజీ నగర్ మహిళను మరోసారి మనస్ఫూర్తిగా విగ్నేశుడి కరుణాకటాక్షాలు నిండుగా ఉండాలని అభినందించడం జరిగింది, అనంతరం రాష్ట్ర యువజన సంఘాల అధ్యక్షులు, ప్రముఖ సామాజిక ఉద్యమ సారధి డా.కూన వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ భారత దేశ చరిత్రలో ప్రత్యేక సంస్కృతి సాంప్రదాయాలు గల చరిత్ర ప్రఖ్యాతిగాంచిన రాష్ట్రం మన తెలంగాణ రాష్ట్రమని అన్ని రంగాలలో మహిళలు ముందుంటూ నేడు సంగారెడ్డి శివాజీ నగర్ లో ఏర్పాటుచేసిన వినాయక నవరాత్రుల సందర్భంగా మహిళలు ముగ్గులు వేసి, చిన్నారి విద్యార్థినీ విద్యార్థులు కూచిపూడి భరతనాట్యం లాంటి సంప్రదాయ నృత్యాలతో తెలుగు సంస్కృతి సాంప్రదాయం వట్టిపడే విధంగా ముస్తాబై భక్తిశ్రద్ధలతో కన్నుల పండుగగా ఈ కార్యక్రమంలో పాల్గొని నిర్వహించడం చాలా సంతోషంగా ఉందని తెలంగాణ రాష్ట్ర యువజన సంఘాల సమితి ద్వారా ప్రత్యేకంగా అభినందనలు తెలుపుతున్న అన్నారు, తరచూ నేటి సమాజంలో పొద్దున లేస్తే రాత్రి వరకు బిజీ బిజీగా ఉండే మహిళలు యువతీ యువకులు నేడు తెలంగాణ సాంప్రదాయ పండుగలో వినాయక చవితి సందర్భంగా ప్రత్యేక స్ఫూర్తిని కలిగించే విధంగా మహిళలు యువతి యువకులు చిన్నారులు అందరూ కలిసి వినాయక నవరాత్రుల మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని భారత సంస్కృతిని నలుమూలల పలు దేశాలకు చాటు చెప్పే విధంగా కార్యక్రమాలలో పాల్గొనడం అభినందనీయమన్నారు, భవిష్యత్తులో కూడా మహిళలు యువతీ యువకులు కంకణ బద్ధులై భారత దేశ సంస్కృతి సాంప్రదాయాలను కాపాడుకునే విధంగా ప్రపంచ దేశాలు హర్షించే విధంగా సాంప్రదాయ పండుగలు నిర్వహించుకోవాలన్నారు, కులమతాల అతీతంగా సమిష్టిగా సంకల్పంతో భారతదేశ ఖ్యాతిని ప్రపంచ దేశాలు గర్వించే విధంగా సాంప్రదాయ పండుగలను చేపట్టాలన్నారు, వినాయక చవితి నవరత్తులు సందర్భంగా రాష్ట్ర ప్రజలు ముఖ్యంగా సంగారెడ్డి జిల్లా ప్రజలు ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో పాడి పంటలతో సుఖ సంతోషంగా సుభిక్షంగా ఉండాలని విఘ్నేషుడిని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా అన్నారు. ఏర్పాటు చేసిన యువజన సంఘాల సమితిని, మహిళలను ప్రత్యేకంగా అభినందించడం జరిగింది,ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కూన సంతోష్,వెన్న చక్రేశ్వర్,బంటి, బబ్బులు,కిట్టు,భాను, కార్తీక్, శ్రీ చరణ్,సన్నీ,శాలిని,సుస్మిత, నాగరాణి, సంతోషి, మాధవి,ఉమా, చిన్నారి చిన్నారులు ప్రజలు భక్తులు పాల్గొని కార్యక్రమం దిగ్విజయం చేయడం జరిగింది.

# నారాయణ్ ఖేడ్‌లో బిఆర్ఎస్ పార్టీలో భారీగా చేరికలు

**బిఆర్ఎస్ పార్టీలో చేరిన కాంగ్రెస్ జిల్లా మహిళా పార్టీ అధ్యక్షురాలు భవాని నరసింహాచారి.**

**మాజీ ఎంపీటీసీ దాము బిజెపి పార్టీ నుండి బిఆర్ఎస్ పార్టీలో చేరారు.**









**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 06 (పిసిడబ్ల్యూ న్యూస్):** శంకరంపేట్(ఆ) పట్టణంలో ఈ కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజలకు మరియు నారాయణఖే నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చక మోసం చేస్తుందని అలాగే స్థానికంగా ఎంపీ మరియు ఎమ్మెల్యే నియోజకవర్గనీ అభివృద్ధి చేస్తామని చెప్పి పదవులు పొంది అభివృద్ధి చేయకా పోగా మహిళలను అవమానిస్తున్నారని భావించి..ఈ నారాయణఖేడ్ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డితోనే అభివృద్ధి చెందుతుందని.గౌరవ నారాయణఖేడ్ మాజీ శాసనసభ్యులు మహారెడ్డి భూపాల్ రెడ్డి ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. చేరిన వారిలో హరి కిషన్,యాదగిరి,స్వరూప, రేఖ,విట్టల్, రోషి రెడ్డి, మల్లన్న,వీరితోపాటు వీరి అనుచరులు సుమారు 200 మందినారాయణ్ ఖేడ్ మాజీ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. వారిని మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్ వైస్ ఎంపీపీ రమేష్, కల్హేర్ మండల పార్టీ అధ్యక్షులు రామ్ సింగ్,మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు సురేష్ గౌడ్, మాజీ మండల కో ఆప్షన్ సభ్యులు యాదుల,చైర్మన్ సంజీవరెడ్డి, సీనియర్ నాయకులు సుభాష్, వైస్ చైర్మన్ కోణం అంజయ్య, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు దత్తు, మాజీ ఎంపీటీసీలు యాకూబ్, వెంకటేశం, మాజీ సర్పంచులు శంకరయ్య, శంకర్ గౌడ్, రవీందర్, అశోక్, ప్రకాష్, సుభాష్ నాయక్, నవీన్ గౌడ్, రాములు నాయక్, విట్టల్ గౌడ్, నరసింహులు సెట్, మాజీ ఉపసర్పంచ్ అంజయ్య, మాణిక్ రెడ్డి, డైరెక్టర్లు విజయ్, అశోక్, రాజా గౌడ్, నీలకంటి విట్టల్, సాయిలు, రామ్ రెడ్డి, భూమ్ రెడ్డి,రామ్ రెడ్డి, సాయి గోండ, చంద్రకాంత్ రావు పటేల్,సంగమేశ్,నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

## రాజరాజేశ్వరి అమ్మవారి ఆశీస్సులు అందరికీ ఉండాలి

**బిజెపి ఖమ్మం అర్బన్ అధ్యక్షులు కుమిలి శ్రీనివాసరావు**

**శ్రీశ్రీశ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానం నూతన కమిటీ సభ్యులను సత్కరించిన కుమిలి శ్రీనివాసరావు**




**ఖమ్మం, సెప్టెంబర్ 6 (పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి) :** రోటరీ నగర్ శ్రీశ్రీశ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి ఆశీస్సులు అందరికీ ఉండాలని బిజెపి ఖమ్మం అర్బన్ అధ్యక్షులు కుమిలి శ్రీనివాసరావు అన్నారు. శనివారం దేవస్థానం నూతన కమిటీ సభ్యులను బిజెపి నాయకులు కుమిలి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శాలువాలతో ఘనంగా సత్కరించారు. నూతనంగా ఎన్నికైన ఆలయ కమిటీ చైర్మన్, కార్యదర్శి లు వెంకటప్పయ్య, సింహాద్రి లను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ, అంజన్న, నీలిమ, ముత్యం, సీతారాములు, రాము తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులు దేవరాజు వెంకటయ్యకు ఘన సన్మానం



**ఖానాపూరం సెప్టెంబర్ 06 (పీసీడబ్ల్యూ న్యూస్):** ఉత్తమ ఉపాధయునిగా ఎన్నికైన సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయునికి సన్మానం ఖానాపురం మండలం పర్శతండా లో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న దేవరాజు వెంకటయ్య తన యొక్క సేవలను గుర్తించి మండలస్థాయి లో ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎన్నిక కాబడినది తన 28 సంవత్సరాల ప్రస్థానంలో ఎంతోమంది విద్యార్థినీ విద్యార్థులను ప్రయోజకులుగా చేసినటువంటి దేవరాజు వెంకటయ్య కి పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ జనగాం లావణ్య మరియు విద్యార్థుల తల్లిదండ్రులు తన తోటి ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు.

## రౌతు రమేష్‌కు సన్మానం




**హన్మకొండ సెప్టెంబర్ 05(పిసిడబ్ల్యు న్యూస్):** గత 33 సంవత్సరాలుగా విద్యుత్ సంస్థలో హెల్పర్గా ఉద్యోగంలో చేరి లైన్ ఇనస్పెక్టర్ గా ఇటీవల పదవీ విరమణ చేసిన రౌతు రమేష్ కుమార్ ను శాసన మండలి ఉప సభాపతి బండ ప్రకాష్ ఘనంగా సన్మానించారు శనివారం హనుమకొండ లోని ఎమ్మెల్సీ బండ ప్రకాష్ తన క్యాంపు కార్యాలయం లో పూల బోకేతో శాలువా తో రమేష్ కుమార్ ను సన్మానించారు. ఉద్యోగం చేస్తూనే, దళిత బహుజను ల కోసం నిరంతరం పోరాటం చేసిన వ్యక్తి అని అభిప్రాయపడ్డారు. రాబోయే కాలంలో పేద ప్రజల కోసం తన శక్తి వంచన లేకుండా కృషి చేయాలని వారి సమస్యలు పరిష్కారం కోసం నిరంతర పాటు పడాలని కోరారు అనేక సంవత్సరాలుగా పేద ప్రజల కోసం పరితపించిన వ్యక్తి రమేష్ కుమార్ అని ఆయన సేవలను కొని యాడారు ఈ సందర్భంగా డాక్టర్ కృష్ణకుమార్, జడల రవి, కె. కృష్ణ, పులి రజనీ కాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీటీసీ వారీగా ముసాయిదా ఓటర్ లిస్ట్ విడుదల

**- ఏ రాములు రామన్నపేట ఎంపీడీవో**

**రామన్నపేట సెప్టెంబర్ 6 (పిసిడబ్ల్యూ న్యూస్ ) :**ఎంపీటీసీ వారిగా ముసా యిదా ఓటర్ లిస్ట్ ముసాయిదా పోలింగ్ కేంద్రాల జాబితా మండల ప్రజా పరిషత్తు కార్యాలయం రామన్నపేట నోటీసు బోర్డులో అన్ని ఎంపీటీసీలలోని గ్రామ పంచాయతిలలోడిస్ప్లే చేయనైనది.

# రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా యూరియా సరఫరాకు పకడ్బందీ చర్యలు



**● జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్,**




**మహబూబాబాద్ జిల్లా సెప్టెంబర్ 06(పి.సి.డబ్ల్యూ న్యూస్):** రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా యూరియా సరఫరాకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.శనివారం జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్, ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, అదనపు కలెక్టర్లు (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో (రెవెన్యూ) కె.అనిల్ కుమార్, డిఏఓ విజయనిర్మల, డిసిఓ వెంకటేశ్వర్లు లతో కలిసి కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో ప్రత్యేక అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు, తహసీల్దారులు, ఎంపీడీవోలు, సంబంధిత అన్ని విభాగాల సిబ్బందితో యూరియా పంపిణీపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు 23,749.296, మెట్రిక్ టన్నుల యూరియా అమ్మకాలు జరిపామని, ఈ రోజు 750, మెట్రిక్ టన్నుల యూరియా రైతులకు అందించడం జరుగుతుందని, ఇంకా వచ్చే యూరియా ను రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అమ్మకాలు చేయుటకు పకడ్బందీ చర్యలు తీసుకున్నట్లు, జిల్లాలోని రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు,వ్యవసాయ శాఖ అధికారులు, మండలాల వారీగా రైతులకు ముందస్తు సమాచారంతో యూరియాను ప్రణాళిక ప్రకారం ఆన్లైన్ విధానం ద్వారా పిఓఎస్, రిజిస్టర్లు లలో నమోదు చేసి అమ్మకాలు కొనసాగించాలని, ప్రైవేటు డీలర్ల వద్ద ఉన్న నిల్వలను తనిఖీ చేస్తూ కలిగి ఉన్న స్టాకును రైతులకు అమ్మకాలు చేయుటకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సూచించారు,అక్రమ నిల్వలు, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న ప్రైవేటు ఫర్టిలైజర్ షాపులను గుర్తించి ఇప్పటికే వారి లైసెన్సులను క్యాన్సల్ చేయడం జరిగిందని, ఎవరైనా ఉద్దేశపూర్వకంగా రైతులను ఇబ్బంది పెడితే శాఖ పరమైన చర్యలు తీసుకుని కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు,కొనుగోలు అధికంగా ఉన్న కేంద్రాలలో అదనపు క్యూ లైన్లు, త్రాగునీరు సదుపాయాలు ఏర్పాటు చేయాలని సూచించారు, కొనుగోలు కేంద్రాలను అన్ని ఏర్పాట్లు కల్పించి, న్యానో యూరియా పై కూడా రైతులకు అవగాహన కల్పించాలన్నారు, రైతులకు అనుకూలమైన సమయం ఉదయమే కొనుగోలు ప్రారంభించాలని సూచించారు, కేంద్రాల వద్ద యూరియా ప్రస్తుత స్టాకు వివరాలను ప్రదర్శించాలని అన్నారు,జిల్లా,నియోజకవర్గ, మండల స్థాయి,లలో యూరియా పంపిణీ చేయు తేదీ సమయాలు విస్తృత ప్రచారం కల్పించాలని సూచించారు.యూరియా కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు పోలీస్,రెవెన్యూ, వ్యవసాయ, సహకార, గ్రామపంచాయతీ, కమ్యూనిటీ కోఆర్డినేటర్స్, తదితర సిబ్బందిని నియమించాలని సూచించారు.సూపరెంటెంట్ ఆఫ్ పోలీస్ సుధీర్ రామ్నాథ్ కేకన్, అదనపు కలెక్టర్లు, లెనిన్ వత్సల్ టోప్పో, అనిల్ కుమార్, వ్యవసాయ శాఖ అధికారిని విజయనిర్మల, డిసిఓ వెంకటేశ్వర్లు, ప్రత్యేక అధికారులకు, తాసిల్దార్లకు, ఎంపీడీవోలకు, యూరియా అమ్మకాలపై పలు సూచనలు చేశారు.ఈ సమీక్షా సమావేశంలో రెవెన్యూ డివిజనల్ అధికారులు గణేష్, కృష్ణవేణి, డి.ఎస్.పి లు తిరుపతిరావు, మండల ప్రత్యేక అధికారులు, వ్యవసాయ సహకార, రెవెన్యూ, పోలీస్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# వాసవి వాగ్దేవి క్లబ్ - సేవలో అగ్రగామి...

**- సేవా కార్యక్రమంలో భాగంగా పాత్రికేయులకు సన్మానం.**







**కరీంనగర్,సెప్టెంబర్6(పీసీడబ్ల్యూ న్యూస్):**వాసవి వాగ్దేవి క్లబ్ వారు చేపడుతున్న సేవా కార్యక్రమాలు ప్రజల ప్రశంసలు అందుకుంటున్నాయి. ఈ క్లబ్ సభ్యులు సమాజంలో అవసరమైన ప్రతి రంగంలో సేవా దృక్పథంతో ముందుకు వస్తున్నారు.పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, పాఠశాల కిట్లు, నోట్‌బుక్స్, యూనిఫార్ములు అందించడం ద్వారా వారి విద్యా ప్రయాణానికి తోడ్పాటు అందిస్తున్నారు.ఆర్థికంగా బలహీన వర్గాల రోగులకు వైద్య సహాయం, ఉచిత ఆరోగ్య శిబిరాలు, బ్లడ్ డొనేషన్ క్యాంపులు నిర్వహించడం ద్వారా ఎన్నో కుటుంబాలకు ప్రాణాధారమవుతున్నారు. అనాథాశ్రమాలు, వృద్ధాశ్రమాలు, వికలాంగుల ఆశ్రమాల్లో ఆహారం, బట్టలు పంపిణీ చేసి వారితో పండుగలు జరుపుకోవడం ద్వారా సేవాస్ఫూర్తిని చాటుతున్నారు.పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కల పంపిణీ, ప్లాస్టిక్ వినియోగం తగ్గించే ప్రచారం, శుభ్రత కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.మహిళా సాధికారత కోసం స్వయం ఉపాధి శిక్షణలు, కుట్టు యంత్రాల పంపిణీ, వృత్తి నైపుణ్యాలపై అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నారు.సహజ విపత్తులు వచ్చిన సందర్భాల్లో తక్షణ సహాయం అందించడానికి ముందుంటూ, ఆహారపదార్థాలు, దుస్తులు, మందులు పంపిణీ చేస్తున్నారు.సామాజిక బాధ్యతను మించిన సేవ భావనతో, వాసవి వాగ్దేవి క్లబ్ సమాజానికి అండగా నిలుస్తోంది. వాసవి మాత వాగ్దేవి ఆశీస్సులతో ఈ సేవా యజ్ఞం నిరంతరంగా కొనసాగుతుందని క్లబ్ సభ్యులు తెలిపారు.

**పాత్రికేయుల సన్మానం:** సేవా కార్యక్రమంలో భాగంగా వాసవి వాగ్దేవి క్లబ్ వారు పాత్రికేయులను ప్రత్యేకంగా సన్మానించారు. సమాజానికి అద్దం పట్టే పాత్రికేయుల సేవను గుర్తించి,వారికి శాలువాలు కప్పి, బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా క్లబ్ సభ్యులు మాట్లాడుతూ, మీడియా సమాజానికి మార్గదర్శక దీపంలా నిలుస్తోంది. జర్నలిస్టులు చేస్తున్న అహర్నిశ కృషి వలనే సేవా కార్యక్రమాలు మరింత విస్తృతంగా ప్రజలకు చేరుతున్నాయి అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమం లో పాల్గొనిన వాసవి క్లబ్ పెద్దలు పద్మ అరుణ ఐపీసీ ఆఫీసర్ పాత రాధా కిషన్ రీజన్ చైర్పర్సన్ వాగ్దేవి క్లబ్ అధ్యక్షురాలు రూప శ్రీ ప్రధాన కార్యదర్శి వజ్జల రాజమణి కోశాధికారి గంపహారిణి పాల్గొన్నారు.

# హిందూ.. ముస్లిం భాయి భాయి గంగా తెహజీబ్‌కు కేరాఫ్ కరీంనగర్

**● గణేష్ నిమజ్జనం రోజు మినరల్ వాటర్, లస్సీ, బాదం మిల్క్, కూల్ డ్రింక్స్, రోజ్ వాటర్‌ను స్వంత ఖర్చులతో హిందూ సోదరులకు అందిస్తున్న ఎంఐఎం నేత గులాం అహ్మద్ హుస్సేన్**

**● 2005 నుంచి నేటి వరకు మానవత్వమే అభిమతంగా జమ్.. జమ్ వెల్ఫేర్ సొసైటీ పేరిట దేశంలోనే ఆదర్శంగా సేవలు ● స్టాల్స్‌ను ప్రారంభించిన జిల్లా పోలీసు కమిషనర్ గౌష్ ఆలం**










**కరీంనగర్ టౌన్ సెప్టెంబర్ 06(పిసిడబ్ల్యూ న్యూస్):** మానవత్వమే అభిమతంగా, దేశంలో ఎక్కడా లేనివిధంగా..మతసామరస్యానికి ప్రతీకగా, గంగా జమున తెహజీబ్ కు కేరాఫ్ కరీంనగర్ నగర వేదికగా, హిందూ-ముస్లిం భాయి భాయి అనే నినాదంతో జమ్.. జమ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో 2005 నుండి ఎంఐఎం కరీంనగర్ అధ్యక్షుడు..తెలంగాణ హజ్ కమిటీ సభ్యులు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ తన స్వంత ఖర్చుతో హిందూ ముస్లిం సోదర భావాన్ని పెంపొందించేందుకు, మానవత్వపు పునాదిగా అద్భుతమైన సేవలు అందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాడని జిల్లా పోలీసు కమిషనర్ గౌష్ ఆలం అన్నారు.. శుక్రవారం గణేష్ నిమజ్జనం సందర్భంగా, నగరంలోని రాజీవ్ చౌక్ లో బాదం మిల్క్, మినిరల్ వాటర్, లస్సీ, గులాబ్ వాటర్ స్టాల్ ను సీపీ గౌష్ ఆలం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత పెద్ద స్టాల్ ను రాజీవ్ చౌక్ లో ఏర్పాటు చేసి సుమారు 30వేల ఉచిత మినరల్ వాటర్ బాటిల్స్, గులాబ్ వాటర్, లస్సీ.. బట్టర్ మిల్క్, బాదాం మిల్క్ ను పంపిణీ చేస్తూ..దేశంలోనే గులాం అహ్మద్ ఆదర్శంగాప్రాయుడన్నారు. దేశంలోనే భిన్నంగా..మత సామరస్యానికి ప్రతీకగా, గంగా జమున తెహజీబ్ కు కేరాఫ్ గా కరీంనగర్లో హిందూ-ముస్లిం అనే భేదభావం లేకుండా ఒక మంచి సాంప్రదాయాన్ని కొనసాగించే పద్ధతిలో భాగంగా గణేష్ నిమజ్జానికి వెళ్లే నగర హిందూ సోదరీ, సోదరుల కోసం ప్రత్యేకంగా స్టాల్ ను ఏర్పాటు చేసి ఉచితంగా పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. వినాయక నిమజ్జనం సందర్భంగా త్రాగునీరు, శీతల పానీయాలు పంపిణీ చేయడం ఎంతో మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. నిమజ్జనానికి వెళు తున్న అశేష జనానికి సరిపడా ఈసౌకర్యాన్ని జమ్ జమ్ వెలేర్ సొసైటీ ద్వారా స్టాల్ ఏర్పాటు చేసి సేవలందించడం మతసామరస్యానికి మారుపేరుగా నిలిచిందని కొనియాడారు. ప్రారంభోత్సవానికి వచ్చిన సిపి గౌస్ ఆలం కు అహ్మద్ హుస్సేన్ కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో ఏసీపీలు వెంకటస్వామి, విజయ్ కుమార్, వాసాల సతీష్, ఎస్బి శ్రీనివాస్, సిఐలు రాంచంద్రరావు, జాన్ రెడ్డి, సృజన్ రెడ్డి, నిరంజన్ రెడ్డి, ఎస్బి ఎస్సై శ్రీనివాస్, ఎంఐఎం నాయకులు బర్కత్ అలీ, ఆతిన, ఆరిఫ్ అహ్మద్, సాజిద్, అబ్దుల్లా ఖాన్, ఉమ్మేజర్, షాకిర్ నహ్దా, ఇస్మాయిల్, ఇలియాజ్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీకృష్ణ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నవరాత్రులు

**విఘ్నేశ్వరుడి లడ్డును 30వేలకు దక్కించుకున్న దుంపల రవి**






**ఖమ్మం, సెప్టెంబర్ 6 (పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి) :** ఖమ్మం నగరంలోని బోడేపూడి స్తూపం వద్ద ఏర్పాటుచేసిన శ్రీకృష్ణ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలతో నవరాత్రులు ఘనంగా నిర్వహించారు. విఘ్నేశ్వరుడి పూజలు అందుకున్న లడ్డూను దుంపల రవి అనే వ్యక్తి రూ.30 వేలకు వేలం పాడుకున్నారు. ఈ సందర్భంగా దుంపల రవి మాట్లాడుతూ.. ఆ గణేశుని ఆశీర్వాదంతో లడ్డును దక్కించుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. శ్రీకృష్ణ గణేష్ శివ కమిటీ ఆధ్వర్యంలో గత ఆరు సంవత్సరాలుగా గణేష్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఈ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నవరాత్రులు ప్రత్యేక కుంకుమ పూజ, పల్లకి సేవ, మహా అన్నదానం వంటి కార్యక్రమాలు నిర్వహించడం చాలా ఆనందంగా ఉందని కమిటీ సభ్యులు తెలియజేశారు. మొదటి ఏడు చిన్న విగ్రహంతో ప్రారంభించిన శ్రీకృష్ణ గణేష్ ఉత్సవ కమిటీ క్రమ క్రమంగా పెరుగుతూ వచ్చింది. ఈ సందర్భంగా శ్రీ కృష్ణా గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు మాట్లాడుతూ... శ్రీకృష్ణా గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఎన్నో కార్యక్రమాలు చేపడతామని, ఆ వినాయకుడి ఆశీస్సులతో డివిజన్ ప్రజలు అంత సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శ్రీ కృష్ణా గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, డివిజన్ ప్రజల తదితరులు పాల్గొన్నారు.

# రైతుల దారి సమస్యను పరిష్కరించండి

● సమస్యను పట్టించుకోని అధికారులు







**రామడుగు సెప్టెంబర్ 06 (పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం లోని రామడుగు మండలంలోని షా నగర్ గ్రామంలో సర్వే నంబర్ 302/16, 302/A భూమి యొక్క దారితమ సమస్యను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతికి విన్నవించినప్పటికీ మండల తాసిల్దార్ రాజేశ్వరి పరిష్కారం చూపడం లేదని బాధితులు వాపోయారు. శనివారం రామడుగు మండలం షానగర్ గ్రామంలో బాధితులు పాత్రికేయుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పర్లపల్లి పోచయ్య లచ్చయ్య దుర్గయ్య లు పాత్రికేయ సమావేశంలో మాట్లాడుతూ గ్రామంలో గత 40 ఏళ్ల నుండి వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నామని అన్నారు. షానగర్ గ్రామంలో మహాలక్ష్మి ఫంక్షన్ హాల్ ఆనుకొని ఉన్న ప్రభుత్వ భూమిలో నుండి తమ వ్యవసాయ భూములకు 30 ఏళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం దారి ఇచ్చిందని అన్నారు. కాగా గత నెల 27న ఇదే గ్రామానికి చెందిన కొంత మంది దళితులు ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూమిని ట్రాక్టర్లతో దున్ని విత్తనాలు వేశారు. ఇదే క్రమంలో తమ వ్యవసాయ భూములకు వెళ్లకుండా ఇరువైపులా జెసిబి తో కందకం తవ్వించి ముళ్ళ కంచెలు వేసి కనీసం నడిచిపోయే దారి లేకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్కు గత నెల 29 న వినతి పత్రం ఇచ్చిన నేటికీ మండల తాసిల్దార్ రాజేశ్వరి మాత్రం సమస్యను పట్టించుకోవడంలేదని ఆరోపించారు. తమను కొంతమంది దళితులు బెదిరిస్తున్నారనిపోలీస్ స్టేషన్లో కూడా ఫిర్యాదు చేసిన కనీసం పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా తమ సమస్యను పరిష్కరించాలని వేడుకుంటున్నారు. తమను బెదిరింపులకు గురి చేస్తున్నారని పోలీసులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడంలేదని ఆరోపించిన నేపథ్యంలో స్థానిక ఎస్సై రాజును వివరణ కోరగా పర్లపెల్లి పోచయ్యలు ఫిర్యాదు ఇచ్చింది వాస్తవమేనని. కానీ విచారణలో ఎవరు బెదిరించలేదని అన్నారు. భూముల తగాదా విషయంలో ఎటువంటి జోక్యం చేసుకోనని విచారణ కోసం తాసిల్దార్ కు నివేదిక ఇస్తాఅన్నారు.

# గణపతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా ముగిసిన గణపతి నవరాత్రి ఉత్సవాలు



**మేడ్చల్ జిల్లా సెప్టెంబర్ 06 (పిసిడబ్ల్యూ న్యూస్):** మేడ్చల్ జిల్లా కేంద్రంలోని గల శివదుర్గా నగర్ కాలనీ వాసులు అంగరంగ వైభవంగా భారీ ఎత్తున గణేష్ నవరాత్రి ఉత్సవాలు కలిసి కట్టుగా కనీవిని ఎరుగని రీతిలో విజయవంతంగ నిర్వహించడం జరిగింది ఈ గణేష్ నవరాత్రి ఉత్సవాలకు శివదుర్గ కాలనీ మహిళలు ముందుకు వచ్చిన కలసికట్టుగా గణపతి నవరాత్రి ఉత్సవాలకు సహకరించిన సోదరిమనులకు మరియు సోదరులకు మరియు పిల్లలకు పెద్దలకు అందరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ అలాగే గణేష్ లడ్డూను వేలం లో ఎంతో మంది పోటీకి వచ్చిన మన శ్రీ అబ్రమేన ఉమా-వెంకట్ 1,21,500 రూపాయలకు దక్కించుకున్నారు వారికి ఆ వినాయకుడు ఆశీస్సులు ఎల్ల వేలల ఉండాలని ఆయురారోగ్యాలు అందించాలని కోరుకుంటున్నాము అలాగే నవరాత్రులు పూజలు అందుకున్న తరువాత లడ్డు వేలం లో కమిటీ అధ్యక్షులు విద్యాసాగర్ మరియు జనరల్ సెక్రటరీ అమరందర్ రెడ్డి మరియు ట్రెసారర్ సాయి సహకారం తో ముఖ్యంగా కల్చరల్ సెక్రటరీ లు సతీష్ కుమార్ మరియు ఎల్లేందర్ రెడ్డి గణేష్ కమిటీ నిర్వాహకుడు తుడి ప్రభాకర్ జానకి రాములు పంతు సంతోష్ మరియు ఎస్ ఎన్ డి కమిటీ సహకారం తో ఎల్లాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందు ఉండి నడిపిచ్చిన గణేష్ కమిటీ చైర్మన్ గుండేటి హరికృష్ణ కి ప్రత్యేక ధన్యవాదములు తెలపడం జరిగింది ఈ కార్యక్రమంలో భక్తులు మరియు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు

# ఉత్తమ ఉపాధ్యాయులకు ఘనంగా సన్మానం








**ఖానాపూరం సెప్టెంబర్ 06 (పీసీడబ్ల్యూ న్యూస్):** ఖానాపూర్ మండలంలోని మండల స్థాయి విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఈరోజు ఉత్తమ ఉపాధ్యాయుల ను ఘనంగా సన్మానించడం జరిగింది . ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీడీవో సునీల్ రాజ్ వచ్చారు వారు మాట్లాడుతూ విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్ది వారి బంగారు భవిష్యత్తును బాటలు వేయాలని గురువు తన బాధ్యతను ఉపాధ్యాయులుగా వారికి మంచి విలువలు విలువలతో కూడిన విద్యను అందించాలని తెలిపారు. అంతకుముందు జ్యోతి వెలిగించి, సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ శ్రీదేవి మాట్లాడుతూ విద్యతోనే విద్యార్థుల జీవితాల్లో మార్పు వస్తుందని విద్యారంగంలో వస్తున్నటువంటి మార్పులకు అనుగుణంగా ఉపాధ్యాయులు భావితరాలకు నిర్మాతలుగా అయ్యే విదంగా ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉందని విద్యార్థులకు తెలియజేశారు. అలాగే ఎంఈఓ శ్రీదేవి మాట్లాడుత విజయంతో విలువైన జ్ఞానాన్ని నేర్పించే గురువులుగా పాఠశాలలో మెరుగైన విద్యను అందించాలని విద్యార్థుల కోసం కృషి వారి భవిష్యత్తు కోసం కృషి చేయాలని కోరారు. అనంతరం మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులను ఎన్నిక చేసి వారిని సన్మానం చేయడం జరిగింది. అలాగే వారికి శాలువకప్పి షీల్డ్ తో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ మండల ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు

# ఉన్నత, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయ బృందానికి ఘన సన్మానం




**సిద్దిపేట్ సెప్టెంబర్0 6 (పిసిడబ్ల్యూ న్యూస్):** సమాజంలో గురువు స్థానం విశిష్టమైనది జక్కాపూర్ తాజా మాజీ సర్పంచ్ దుర్గం పరిశు రాములు అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జక్కాపూర్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుని ఉపాధ్యాయులకు ఘనంగా సన్మానం నిర్వహించినారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యతో పాటు వినయం సంస్కారము నేర్పేది వ్యక్తి నిర్మాణం చేసే విశిష్టమైన వ్యక్తులు ఉపాధ్యాయులని అన్నారు. జక్కాపూర్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు రాష్ట్ర జిల్లా స్థాయి ర్యాంకులు సాధిస్తూ జిల్లాలోనే ఉత్తమ ఫలితాలు సాధించడానికి విశేషంగా కృషి చేస్తున్న ఉపాధ్యాయులను అభినందిస్తూ సన్మానించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు షౌకత్ అలీ మాట్లాడుతూ తల్లిదండ్రులను గురువులను గౌరవించాలని సంస్కారంతో కూడిన విద్య సమాజంలో వెలుగు నింపుతుందని విద్యార్థులకు సూచించారు. జక్కాపూర్ గ్రామంలో ప్రజా ప్రతినిధులు విశేషంగా భాగస్వాములై ఉత్తమ ఫలితాలు సాధనలో పాలుపంచుకుంటున్నారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మట్టె బాల్ రెడ్డి, మరియు మాకిల శ్రీనివాసరెడ్డి, మట్టి రాజు, రాగుల మహేష్, ఎర్రం భాస్కర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


# నీకంటూ ఓ లక్ష్యం ఏర్పరచుకోక పోతే.... ఎవరో ఒకరు తమ లక్ష్యం కోసం నిన్ను వాడుకుంటారు

**కోణాపూర్ సాయి కన్నా..**

**నేను చేయాల్సిన పని చాలా ఉంది.**

**నా పని పంచుకునే నాలాంటి వారి కోసం ఎదురుచూస్తున్నాను..**

**యంగ్ డెమోక్రసీ నెక్సాస్ సంస్థ స్థాపిస్తున్నట్లు వెల్లడి.**



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 06 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఈ సమాజంలో అందరికీ సమానమైన హక్కులు అవకాశాలు అందాలి అని ఆశించే వ్యక్తిని నేను ప్రతి వ్యక్తి సామాజికంగా ఆర్థికంగా బలోపేతం అవుతూ స్వేచ్ఛగా జీవించే హక్కు కలిగి ఉండాలని చెప్పి కోరుకునే వ్యక్తిని కొత్త తరం యువకులతో రాజకీయాలను కొత్తగా చేయాలి అనే ఆలోచన తో యంగ్ డెమోక్రసీ నెక్సస్ అనే యువజన సంఘాన్ని స్థాపిస్తున్నాను ,యంగ్ డెమోక్రసీ నెక్సస్ వ్యవస్థాపక అధ్యక్షుడను.నేటి సమాజంలో రాజకీయాలు భ్రష్టు పట్టాయి అని ప్రతి ఒక్కరికి తెలుసు. రాజకీయ పార్టీలు వ్యవహరిస్తున్న తీరు వారు చేస్తున్న రాజకీయాలు వారి స్వప్రయోజనాల కోసమే తప్ప శాశ్వతమైన ప్రజా శ్రేయస్సు కొరకు కాదు అని ప్రజలు గమనిస్తున్నారు.కానీ ఇప్పటివరకు నిజాయితీగా ప్రజల పక్షానే నిలబడి వారి గొంతుకగా మాట్లాడే ఏ యువజన సంఘం లేకపోవడం బాధాకరం. కొన్నిసార్లు ఎర్రజెండాలు ఆ ప్రయత్నం చేస్తున్నప్పటికీ ఎలక్షన్స్ వచ్చే సమయానికి వారు ప్రజలు వారికి ఇచ్చిన బలాన్ని రాజకీయ పార్టీలకు తాకట్టు పెడుతున్నారు.ఇది ఇంకా బాధాకరమైన విషయం కాబట్టి భవిష్యత్తులో యంగ్ డెమోక్రసీ నెక్సస్ సమితి నిజాయితీగా ప్రజా అవసరాలను గుర్తించి ప్రజా సమస్యలను పరిష్కారం కొరకు ప్రజా హక్కులను కాపాడేందుకు బలంగా రాజకీయ పార్టీల పైన ఒత్తిడిని తీసుకొచ్చే ప్రయత్నం చేయబోతుంది.ఈ ప్రయాణంలో యంగ్ డెమోక్రసీ నెక్సస్ సమితి నుండి చాలామంది వ్యక్తులు నాయకులుగా ఎదగబోతున్నారు.ఆ నాయకులు నిజాయితీగా నిస్వార్థంగా ప్రజలకు సేవ చేసే లాగా వారికి దిశా నిర్దేశం చేస్తూ ఈ సమాజానికి మంచి నాయకులను అందించి తద్వారా ఈ సమాజంలో మార్పును తీసుకొచ్చే ప్రయత్నం యంగ్ డెమోక్రసీ నెక్సస్ సమితి చేయబోతున్నది. కలిసి వచ్చే ప్రతి శక్తిని కలుపుకొని ఈ రాజకీయ వ్యవస్థలో శక్తివంతమైన సంఘంగా భవిష్యత్తులో ఎదగబోతుంది యంగ్ డెమోక్రసీ నెక్సస్సమితి.మీరు కూడా ఇలాగే ఆశించే వ్యక్తి అయితే మాతో కలిసి రండి సమ సమాజ నిర్మాణం కి అడుగులు వేస్తూ నవభారతాన్ని నిర్మిద్దాంనేను చేయాల్సిన పని చాలా ఉంది నా పని పంచుకునే నాలాంటి వారి కోసం ఎదురుచూస్తున్నాను మీకు తెలిసిన నాలాంటి వారు ఉంటే నాకు పరిచయం చేయండి.

# పట్టణాలలో పాలన సమర్థవంతంగా జరగాలి

● సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో మంథని , సుల్తానాబాద్

**మున్సిపాలిటీల పని తీరు పై సమీక్షించిన జిల్లా కలెక్టర్**



**పెద్దపల్లి, సెప్టెంబర్ 06 (పిసిడబ్ల్యూన్యూస్):** పట్టణాలలో పాలన సమర్థవంతంగా జరగాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష శనివారం మంథని , సుల్తానాబాద్ మున్సిపాలిటీ ల పని తీరు పై సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ పట్టణ ప్రాంతాలలో రోడ్లపై పశువులు ఉండకుండా గోశాలలకు తరలించాలని, కోతుల సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. పట్టణంలో ఎక్కడ డార్క్ ఏరియా ఉండకుండా అవసరమైన విద్యుత్ స్తంభాలు లైట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. పట్టణాలలో నివసించే ప్రజలకు ఎటువంటి ఆటంకాలు లేకుండా నీటి సరఫరా చేయాలని అన్నారు. పారిశుధ్య నిర్వహణలో భాగంగా రోడ్లపై ఎలాంటి చెత్త లేకుండా చూడాలని, వీధి కుక్కలు పందులను ఊరికి దూరంగా తరలించాలని అన్నారు.పట్టణ ప్రణాళిక విభాగంలో భాగంగా ఎటువంటి ఆక్రమణలు రోడ్లపై లేకుండా చూడాలని, అనుమతి లేని నిర్మాణాలను వెంటనే తొలగించుటకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఇంటి పన్ను ఆస్తి పన్ను డెడ్లైన్ ప్రకారం 100% వసూలు చేయాలని , పట్టణాల్లోని మురికి కాలువలు, నాళాలలో సిల్టును పూర్తిస్థాయిలో తొలగించేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పట్టణ ప్రాంతాలలో టి.యూ.ఎఫ్.ఐ.డి.సి , అమృత్ 2.0 క్రింద చేపట్టిన పలు అభివృద్ధి పనులు నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని, అభివృద్ధి పనులు నాణ్యతతో జరిగేలా ఎప్పటికప్పుడు నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్లు మంథని వెంకన్న, సుల్తానాబాద్ రమేష్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# 48 మంది ఉపాధ్యాయులకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా సత్కారం

**- జిల్లా విద్యాశాఖ అధికారి డి.మాధవి**

**సెప్టెంబర్ 8న ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం**

**పెద్దపల్లి, సెప్టెంబర్-06 (పిసిడబ్ల్యూన్యూస్):** పెద్దపెల్లి జిల్లాలో 48 మంది ఉపాధ్యాయులకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా సత్కరించేందుకు జాబితా సిద్ధం చేశామని జిల్లా విద్యాశాఖ అధికారి డి మాధవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా పెద్దపల్లి జిల్లా పాఠశాల విద్యాశాఖ పరిధిలో పనిచేస్తున్న 48 మంది ఉపాధ్యాయులకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా సత్కరించుటకు జాబితా విడుదల చేశామని అన్నారు. ఎంపిక కాబడిన ఉపాధ్యాయులు సమీకృత జిల్లా కలెక్టరేట్ కార్యాలయం నందు సెప్టెంబర్ 8న మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించే సత్కార కార్యక్రమానికి హాజరు కావాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# పాత్రికేయులకు కిట్స్ వాకర్స్ సన్మానం





**హన్మకొండ సెప్టెంబర్ 06(పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రజలకు ప్రభుత్వాలకు మధ్య వారధిగా ప్రతిరోజు ప్రపంచం నలుమూలల జరిగే విషయాలను వార్తల ద్వారా అందించే పాత్రికేయుల కృషి అభినందనీయమని డిస్ట్రిక్ట్ వాకర్స్ 303 డిప్యూటీ గవర్నర్ పావుశెట్టి శ్రీధర్ అన్నారు హిట్స్ వాకర్స్ అధ్యక్షులు నాగమల్ల సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన పాత్రికేయుల సన్మాన కార్యక్రమానికి డిస్ట్రిక్ట్ వాకర్స్ 303 డిప్యూటీ గవర్నర్ పావుశెట్టి శ్రీధర్ పాల్గొని స్థానిక పాత్రి కేయులను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సన్మానంలో పాల్గొన్న వారు కందుకూరి సంజీవ్, ఎలక రాజు, సదానందం, గడం సంపత్, చెన్నూరు శ్రీనివాస్, సందెల రాజు, నడ్డునూరి బాబురావు, బాబు, దాడి చిరంజీవి, సునీల్, రామంచ మధుకర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో 303 వాకర్ సంయుక్త కార్యదర్శి బొక్క కుమార్ మాజీ అధ్యక్షులు పుల్ల దుర్గారావ్, సలహాదారులు బోడ యుగంధర్, తూర్పల భాస్కర్, వేల్పుల తిరుపతి, శ్రీకాంత్, మధుసూదన్ రెడ్డి, గుండె మీద భాస్కర్, అనిల్ రెడ్డి పాల్గొన్నారు.

# రికార్డ్ స్థాయిలో సుమారు 7 వేల విగ్రహాల నిమజ్జనం

**హన్మకొండ సెప్టెంబర్ 06(పిసిడబ్ల్యు న్యూస్):** ఈ సంవత్సరం వరంగల్ నగరం లోని ప్రధాన గణేష్ నిమజ్జనం చెరువు ప్రాంతా ల్లో జిల్లా యంత్రాంగం తరపున అన్ని ఏర్పాట్లు చేయడం జరిగింది. అన్ని విభాగాల సమన్వయంతో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిమజ్జన కార్యక్రమాన్ని శనివారం సాయంత్రం ముగించనైనది. గత సంవత్సరం (4500) తో పోలిస్తే ఈ సంవత్సరం రికార్డ్ స్థాయిలో 7 వేల పై చీలుకు విగ్రహాల నిమజ్జనం జరిగింది. వరంగల్ జిల్లాకు సంబంధించి సాయంత్రం 3.00 గంటల వరకు పూర్తయింది. సాయంత్రం 5.00 గంటలకు హనుమ కొండ జిల్లాకు సంబంధిం చిన రెడ్డి కాలనీ ఇతర ప్రాంతాల విగ్రహాలు నిమజ్జ నానికి దేశాయిపేట చిన్న వడ్డేపల్లి చెరువుకు రాగా, వాటిని కూడా అధికారులు సిబ్బంది దగ్గర ఉండి ప్రశాంతంగా నిమజ్జనం జరిగేలా అన్ని చర్యలు తీసుకున్నారు.

# ఉపాధి హామీ కూలీల డబ్బులు చెల్లించాలి




**చిట్యాల, సెప్టెంబర్ 6, (పిసిడబ్ల్యూ న్యూస్):** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనులు చేసిన కూలీలకు నేటి వరకు కూలీ డబ్బులు రాకపోవడంతో కూలీలు ఇబ్బందులు పడుతున్నారని సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జయశంకర్ భూపాలపల్లి జిల్లా కార్యదర్శి మారపల్లి మల్లేష్ అన్నారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో మాట్లాడుతూ ఈ సంవత్సరం మార్చి నుండి జూన్ వరకు ఉపాధి ఉపాధి కూలీలు ఎండను సైతం లెక్కచేయకుండా అర్ధాకలితో పస్తులు ఉంటూ ఉపాధి పనులు చేస్తే ప్రభుత్వం కూలి డబ్బులు మంజూరు చేయకపోవడం సరైంది కాదు అన్నారు. ప్రభుత్వం అధికారులు స్పందించి ఉపాధి హామీ కూలీలకు రావలసిన కూలీ డబ్బులు మంజూరు చేసే వారి అకౌంట్లలో జమ చేయాలని ప్రభుత్వాన్ని ఆయన కోరారు.

# విగ్రహ దాతగా నిలిచిన పిసిడబ్ల్యూ న్యూస్ జర్నలిస్ట్ మనోర స్వామి

**నిమజ్జనానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ సర్పంచ్ రవీంద్ర చారి.**

**అన్నదానానికి విరాళం ఇచ్చిన వుమ్మగాని పద్మ.**

**చిన్నారులే పూజారులైన వేళ..**












**తొర్రూరు ప్రతినిధి, సెప్టెంబర్ 6(పిసిడబ్ల్యూ న్యూస్):** గుర్తుర్ చరిత్రలో ఇదొక అద్భుతమైన ఘట్టం. చిన్ని చిన్ని గణపయ్య కమిటీ సభ్యులు చిట్టి చేతులతో వినాయకుని నిలబెట్టాలని ఆలోచన వీరిలో కలిగింది. ఆలోచన వచ్చిందే తడవుగా విషయాన్ని ఇంట్లోని పెద్దలకు తెలపడంతో విగ్రహ దాత కొరకు ఆలోచన చేశారు. వారికి వచ్చిన ఆలోచనలు చిన్నారులందరూ పి సి డబ్ల్యూ న్యూస్ జర్నలిస్ట్ మనోహర స్వామి దగ్గరికి వచ్చి మాకు విగ్రహ దాతగా మీరు నిలవాలని అడగడంతో చిన్నారుల మనసు నొప్పియ్యకుండా విగ్రహాన్ని కొ నీయడం జరిగింది. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలంలోని గుర్తురులో నాలుగవ వార్డు సింగారం కిరణ్ కుమార్ గృహం ప్రాంతంలో విగ్రహ ప్రతిష్టాపన చేశారు. వేదమంత్రాలతో పూజారులు తొమ్మిది రోజులు పూజలు అందించారు. పూజకు కావలసిన పూజ సామాను పూర్తిగా కమిటీ సభ్యులతో పాటు సింగారం కిరణ్ కుమార్ మిగతా ఖర్చులు భరించుకున్నారు.తొమ్మిది రోజుల పూజ అనంతరం గణపతి బప్పా మోరియా అంటూ చిన్నారులందరు ఆటో పైన విగ్రహాన్ని నిలబెట్టి ఆటోలో ఉన్న మైక్ సౌండ్ తో ఊరేగింపు కొనసాగించారు. నిమజ్జనం రోజు చిన్నారుల ఆహ్వానం మేరకు గుర్తురు మాజీ సర్పంచ్ మోత్కూరు రవీంద్ర చారి దంపతులు హాజరై పూజలు నిర్వహించారు. గణపతి నవరాత్రి సందర్భంగా ఉమ్మగాని పద్మ అన్నదానం కొరకు చిన్నారులకు 2000 రూపాయలు విరాళంగా ఇవ్వడంతో చివరి రోజున పులిహోర చేసి పంచిపెట్టారు. ఇదే కాకుండా గణపతి చేతిలోని లడ్డును విరాళంగా ఇచ్చిన జర్నలిస్టు తిరునహరి మనోహర స్వామి ఇంటి వరకు గణపతి బప్పా మోరియా అంటూ ఊరేగింపుగా పూజారితో సహా మనోహర స్వామి ఇంటికి వచ్చి ప్రసాదాన్ని అందజేశారు. చిట్టి చేతులతో చిన్నారులు ఊరేగింపుగా రావడం అందరినీ ఆకర్షింప చేశారు. చిన్నారులకు గ్రామస్తులు అభినందనలు తెలిపారు. మనోర స్వామి గణపతి ప్రసాదాన్ని అందరికీ పంచిపెట్టారు. చిన్నారులు ముఖ్యఅతిథిగా వచ్చిన వారికి అన్నదానం కోసం సహాయం చేసిన వారికి ప్రత్యేక నమస్కారాలు తెలుపుతున్నారు. మీరు ఇలాగే వచ్చే సంవత్సరం కూడా కొనసాగించేలా చూడాలని కోరుకుందాం. కమిటీ సభ్యులు సింగారం రుత్విక్, పిల్లి నిక్షిత్, సింగరం విష్ణువర్ధన్, సింగరం ధీరజ్ వీరంతా ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు.



# రైతులకు యూరియా సక్రమంగా సరఫరా చేసేలా చర్యలు

**● పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు ● వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు ఫోన్ చేసిన ఎమ్మెల్యే. ● పిఎసిఎస్‌ల ద్వారా రైతులందరికీ యూరియా అందిస్తాం. ● పక్కా ప్రణాళికతో పంపిణీకి కృషి చేయాలి.**

**పెద్దపల్లి సెప్టెంబర్ 06 (పిసిడబ్ల్యూన్యూస్):-** పెద్దపల్లి నియోజకవర్గం లో మరియు జిల్లాలోని రైతులకు సరిపడా యూరియా సక్రమంగా అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టిందని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణా రావు అన్నారు. పెద్దపల్లి క్యాంపు కార్యాలయంలో వ్యవసాయ శాఖ అధికారులతో ఎమ్మెల్యే విజయరమణా రావు శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో, పెద్దపల్లి నియోజకవర్గంలో రైతులకు సరఫరా చేసిన యూరియా, ప్రస్తుతం ఉన్న నిల్వల వివరాలను ఎమ్మెల్యే అధికారులను అడిగి తెలుసుకున్నారు. మరింత యూరియా దిగుమతి అవుతుందని, రైతులు ఆందోళన చెందవద్దని కోరారు. వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో యూరియా నిల్వలపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా చూడాలని ఆదేశించారు. కొందరు ప్రతిపక్ష నాయకుల కుట్రలతో యూరియాపై లేనిపోని అపోహలు సృష్టిస్తున్నారని, అధికారులు అప్రమత్తంగా ఉండి రైతులకు యూరియా అందేలా చూడాలన్నారు. ప్రైవేట్ డీలర్ల వద్ద నిల్వలను ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తూ రైతులకు సరఫరా చేసేలా అధికారులు కష్టపడి పనిచేయాలని పేర్కొన్నారు. కేంద్రం నుండి అందాల్సిన సమయంలో సరిపడా యూరియా జిల్లాకు దిగుమతి కాకున్నా పెద్దపల్లి నియోజకవర్గంలో ముందస్తు చర్యలతో యూరియా ఇబ్బందులు ఎక్కువగా లేకుండా నియంత్రించామని తెలిపారు. రైతుల అవసరాల మేరకు యూరియాను అందుబాటులో ఉంచింది పెద్దపల్లి నియోజక వర్గంలో యూరియా కొరత లేకుండా చూస్తానని, రైతులు ఆందోళన చెందవద్దని ఎమ్మెల్యే కోరారు. అధికారులు ఆదిశగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆదేశించారు. అనంతరం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు ఎమ్మెల్యే విజయరమణా రావు ఫోన్ చేసి యూరియా అవసరాలను వివరించారు. పెద్దపల్లిలో తక్షణమే మరింత ఎక్కువగా యూరియా సరఫరా చేయాలని కోరగా స్పందించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెంటనే యూరియా పంపిణీ చేస్తామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్, పెద్దపల్లి ఏడీఏ శ్రీనాథ్, మండల వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.



# రిజర్వేషన్లల పేర్లతో మరోసారి బీసీలకు మోసం?

**● బీసీలు మోనం వీడండి..లేకుంటే రాజకీయ అధికారానికి మరింత దూరం కాక తప్పదు.**

**● ఓటు వేయడానికి తప్ప ఒరిగేదేమి లేదు.! ● ఓట్లు ఎక్కడ జరుగుతున్నాయి? ● ఎక్కడ సమావేశాలు పెడుతున్నారు? ● బీసీలకు మోసం జరుగుతుంటే కళ్ళకు గంతలు కట్టుకున్న ప్రజా సంఘాలు.! ● నియోజకవర్గ బీసీ సేన అధ్యక్షులు కత్తి చంద్రశేఖర అప్ప**



**షాద్ నగర్, సెప్టెంబర్ 06 (పిసిడబ్ల్యూన్యూస్):**-చెల్లని రూపాయికి గీతలు ఎక్కువ అన్నట్లుగా ఉంది తెలంగాణలో బీసీల వ్యవహారం...ఒకవైపు అధికార పార్టీ బీసీలకు 42శాతం రిజర్వేషన్ ఇస్తామంటూనే మరోవైపు ఉపరాష్ట్రపతికి వారికి నచ్చిన రెడ్డి సామాజిక వర్గానికి దక్కాలని చూస్తుంటే ఇది తెలియక కొంతమంది వారికి వత్తాసు పలుకుతు సభలు,సమావేశాలకు తెరలేపితే ఇది తెలియని ఇంకోందరు వారికి మద్దతుగా ఉంటూ అదేదో సామెత అన్నట్లుగా ఎక్కడా ఆహారం దొరకకపోతే ఆకలేసినప్పుడు తల్లిపాము పిల్లపామును తిన్నట్లు బీసీలను బీసీలతోనే నాశనం చేసే ప్రక్రియకు కొంతమంది అధికార దాహం పాలకులు తెరలేపారనేదాంట్లో ఎలాంటి సందేహం లేదని చెప్పుకోవచ్చు అనేదానికి ప్రస్తుతం తెలంగాణలో జరుగుతున్న సంఘటనలు,ఉదంతాలే నిదర్శనం,ఉదాహరణలు...పాపం ఇవన్నీ తెలియని చాలామంది బీసీలు కొంతమంది చేతిలో బంది అయ్యి నిర్వీర్యం అవుతుండటం బాధాకరం...సమావేశాలు పెట్టిన ప్రతిసారి పాలకులు,నాయకులు బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇస్తామంటూనే,దేశ ఉన్నత హోదాలో ఉన్న ఉప రాష్ట్రపతి పదవికి బీసీలు అర్హులు కారా? అంటూ ప్రశ్నిస్తున్నారు..రిజర్వేషన్ ల పేర్లతో మరోసారి బీసీల(కులాల)మధ్య చిచ్చు పెడుతున్నారనే విమర్శలు ఉండనే ఉన్నాయి...ఇకనైనా బీసీలు మోనం వీడండి..లేకుంటే రాజకీయ అధికారానికి మరింత దూరం కాక తప్పదని విశ్లేషకులు చెబుతున్నారు..రాబోయే కాలంలో, రోజుల్లో బీసీలు ఓటు వేయడానికి తప్ప ఒరిగేదేమి లేదని హెచ్చరిస్తున్నా రు...ఇదిలా ఉంటే ఓట్లు వేసేది ఎంపీలు అయితే ఇక్కడ సమావేశాలు,సభలు అవసరమే లేదనేది మరో వాదన... స్థానికులకు అవకాశం ఉందా? అంటూ ప్రశ్నిస్తున్నారు మరి కొంతమంది బీసీ ప్రజా సంఘాలు,రాజకీయ నాయకులు...రౌండ్ టేబుల్, సమావేశాల పేర్లతో బీసీలే బీసీలకు ద్రోహం చేస్తున్న వారికి దూరంగా ఉంటూ,మనల్ని మనం కాపాడుకోవాలని కోరుతున్నారు అనుభజ్ఞులైన రాజకీయ పండితులు,విశ్లేషకులు.ఏదైవైనా పాలకులు బీసీ లపై సవతి తల్లి ప్రేమ చూపిస్తేన్నారనేది ఇంకా చాలామంది నాయకులు,బీసీ ప్రజా సంఘాలు,విద్యార్థులు, యువత, మహిళలు తెలుసుకోవాల్సిన అత్యవసరం ఉంది.

## టేకులసోమారం గ్రామంలో ఘనంగా జిట్టా బాలక్రిష్ణ రెడ్డి ప్రధమ వర్ధంతి



**యాదాద్రి సెప్టెంబర్ 6(పిసిడబ్ల్యూ న్యూస్):**తెలంగాణ మలిదశ ఉద్యమ నాయకులు, తెలంగాణకు మొట్టమొదటి ఫ్లోరైడ్ రహిత నీటిని అందించిన, సుజలదాత, వివేకానంద యువజన సంఘాల వారధి భువనగిరి ముద్దుబిడ్డ స్వర్గీయ జిట్టా బాలకృష్ణారెడ్డి ప్రధమ వర్ధంతి సందర్భంగా టేకులసోమారం గ్రామంలో జిట్టాన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించిన చేగూరి వంశీ రాజ్.ఈ కార్యక్రమంలో చేగూరి శంకర్, అజయ్ ,శంకర్ ,వెంకటేష్, మైసయ్య , రామచంద్రయ్య, నరేష్, శివ, సైదులు,మురళి, నవీన్ రెడ్డి, నవీన్, వినయ్, బన్నీ, ఉదయ్, తదితరులు పాల్గొన్నారు.

## చిగురుపల్లి సోమయ్యని పరామర్శించిన బిఆర్ఎస్ రాష్ట్ర సీనియర్ నాయకులు చింతల వెంకటేశ్వర్ రెడ్డి



**యాదాద్రి సెప్టెంబర్ 6(పిసిడబ్ల్యూ న్యూస్):**యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం అనంతరం గ్రామానికి చెందిన చిగురుపల్లి సోమయ్య గత వారం రోజుల క్రితం పాంక్రియాస్ ఆపరేషన్ జరిగింది.ఈ విషయాని తెలుసుకొని శనివారం రోజు వారి నివాసానికి వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్న బిఆర్ఎస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు చింతల వెంకటేశ్వర్ రెడ్డి ,వారి వెంట సింగిరెడ్డి ప్రభాకర్ రెడ్డి,వల్లపు విజయ్,దండబోయిన బాలరాజు యాదవ్ ,గుదే శ్రీశైలం, దోసపాటి హరీష్ ఉన్నారు.

## జర్నలిస్ట్ పై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలి..

**నందిగామ ఆదాబ్ హైదరాబాద్ రిపోర్టర్ పై దాడిని ఖండిస్తున్నాం**

**టీడబ్ల్యూజేఎఫ్ డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు రాఘవేందర్ గౌడ్, నరేష్**





**షాద్ నగర్,సెప్టెంబర్ 6(పిసిడబ్ల్యూ న్యూస్):** షాద్ నగర్ నియోజకవర్గంలోని నందిగామ మండల ఆదాబ్ హైదరాబాద్ రిపోర్టర్ సందీప్ పై దాడిని టీడబ్ల్యూజేఎఫ్ డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు రాఘవేందర్ గౌడ్, నరేష్ తీవ్రంగా ఖండించారు.రాఘవేందర్ గౌడ్, నరేష్ మాట్లాడుతూ జర్నలిస్టుల పై దాడులు చేయడం సరైన విధానం కాదని, దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.సందీప్ ఎదుగుదలను చూసి ఓర్వలేక ఇలాంటి దాడులకు పాల్పడడం ఏంటని విమర్శించారు. ఏవైనా సమస్యలు ఉంటే సామరస్యంగా మాట్లాడుకోవాలని, ఇలాంటి దాడులు చేయడం హేయమైన చర్య అని అన్నారు. దాడి కి పాల్పడిన వారు ఎవరైనా సరే వారిని గుర్తించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.